
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 3 ఆగస్టు 2025

అమ్మవారికి బంగారు కాసులహారం వితరణ

గుర్రంకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మతల్లికి దాతలు బంగారు కాసులహారం వితరణగా అందజేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన రెడ్డివరప్రసాద్ తనయుడు మనోజ్‌కుమార్ అమ్మవారికి రూ.2 లక్షల విలువైన బంగారు కాసులహారాన్ని వితరణగా ఇచ్చారు. వీటిని శనివారం ఈవో మంజులకు అందజేశారు. అనంతరం ఈవో దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇళ్లు.. ఎన్నేళ్లు...!

- వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం
- అసంపూర్తిగా పేదల ఇళ్లు
- లే అవుట్‌లలో దర్శనమిస్తున్న మొండిగోడలు
- పేదల కల నెరవేరేదెప్పుడో...?



గోడలకే పరిమితమైన పక్కా గృహాలు

ములకలచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతంగా పేరొందిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో పక్కాగృహాలు లేని నిరుపేదలు ఎందరో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాల్లోని పేదలకు పీఎంఏవై కింద 2019-2022 మధ్య కాలంలో 12,393 ఇళ్లను మంజూరు చేశారు. పక్కా గృహాల నిర్మాణాలకు ఒకొక్కరికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. కానీ లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు లబ్ధిదారుల వెంట పడుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. సిమెంటు, కమ్మీ, కూలీల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేదలు ఆసక్తి చేపడం లేదు.

మంజూరు 12,393... పూర్తయింది 6966

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని పేదలకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు చెబుతున్న ప్రకారం 12,393 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు కేవలం 6966 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. పూర్తయిన ఇళ్లలో కూడా చాలా వరకు లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు. అధికారుల లెక్కల ప్రకారం ఇళ్లు మోల్డింగ్ పడితే పూర్తయినట్లు చెబుతున్నారు. మోల్డింగ్ అయ్యి నిలిచిపోయిన ఇళ్లు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. మండలాల వారిగా పూర్తయిన వివరాలు ఇలా ఉన్నాయి.

ములకలచెరువు లేఅవుట్‌లో మరీ దారుణం

ములకలచెరువుకు రెండున్నర కి.మీ. దూరంలో ఉన్న గుట్ట ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం జరిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు ఖర్చు పెట్టి గుట్టను చదును చేశారు. ములకలచెరువుతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు ఇళ్లు మంజూరు చేసి పట్టాలు ఇచ్చారు. 305 మందికి ఇళ్లు మంజూరు చేశారు. మొదట్లో గుట్ట ప్రాంతం కావడం, ములకలచెరువుకు దూరంగా ఉండడంతో ఇళ్ల నిర్మాణం నెలల తరబడిగా ప్రారంభం కాలేదు. అధికారుల ఒత్తిడితో లబ్ధిదారులు ఇళ్లను ప్రారంభించారు. అధికారుల లెక్కల ప్రకారం ఇక్కడ 146 ఇళ్లు పూర్తయినట్లు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే కేవలం 15 ఇళ్లకు లోపే పూర్తయినట్లు కనిపిస్తున్నాయి. అధికారులు ఇంటి మోల్డింగ్ అవుతూనే పూర్తయినట్లు లెక్కలు వేస్తున్నారు. కాగా లే అవుట్‌లలో సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో ఉన్న మట్టి రోడ్లు దుస్థితికి చేరాయి.



ములకలచెరువుకు సమీపంలోని లే అవుట్‌లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలు

అమ్మకానికి పక్కా గృహాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల మంజూరులో భారీగానే అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఇళ్లు ఉన్న వారికి కూడా ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఇళ్ల మంజూరు చేయడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిజమైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలువురు ఇళ్లను ఇతరులకు అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి.



దుస్థితిలో ఉన్న రోడ్డు

వైసీపీ ప్రభుత్వ హయాంలో అంతా ఆర్భాటం... నాటి సీఎం జగన్ ఇళ్లు కాదు ఊర్లు నిర్మిస్తాం... అంటూ ప్రగల్భాలు పలికారు. జగనన్న కాలనీల పేరిట భారీ ఎత్తున భూ సేకరణ చేశారు. కొండల్లో.. గుట్టల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అక్కడే నిర్మించుకోవాలని ఇళ్లు మంజూరు చేశారు. ప్రచారంపై ఉన్న మక్కువ పేదల ఇళ్ల నిర్మాణంపై చూపలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యం కారణంగా పేదలకు సొంతిల్లు కలగానే మిగిలింది. పురోగతి మందగించడంతో ఎటుచూసినా మొండిగోడలే దర్శనమిస్తున్నాయి.

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
1) బి.కొత్తకోట	1126	756
2) బి.కొత్తకోట(అర్బన్)	1202	379
3) కురబలకోట	2188	1077
4) ములకలచెరువు	1812	1165
5) పెద్దతిప్పసముద్రం	2348	1390
6) పెద్దమండ్యం	1675	983
7) తంబళ్లపలె	2042	1216

కూటమి ప్రభుత్వం అదనపు సాయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అదనంగా సాయం అందిస్తోంది. బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తోంది. లబ్ధిదారులకు అదనంగా సాయం అందిస్తున్నా 50 శాతం మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారని గృహనిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. పునాది దశల్లో ఉన్న ఇళ్లకు కూటమి ప్రభుత్వం కొత్త పథకం పరిధిలోకి తెచ్చి ఇప్పుడు ఇళ్ల నిర్మాణాలకు ఇస్తున్న సహాయం అందిస్తే తప్ప ఇళ్ల నిర్మాణం జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

ఇళ్లు పూర్తి చేయించేందుకు చర్యలు



లే అవుట్‌లలో పక్కా గృహాలు పూర్తి చేయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. కలెక్టర్ ఆదేశాలతో ప్రతిరోజు లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్లు ప్రారంభించేలా చూస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇస్తున్న అదనపు సాయంపై లబ్ధిదారులకు తెలియజేస్తున్నాం. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం జరిగేలా చూస్తాం.

- వెంకట్‌రెడ్డి, హౌసింగ్ డీఈ, తంబళ్లపల్లె నియోజకవర్గం

రాజంపేట కోర్టును పరిశీలించిన జిల్లా జడ్జి



రాజంపేట కోర్టు ఆవరణాన్ని పరిశీలిస్తున్న కడప జిల్లా జడ్జి యామిని, కోర్టు సిబ్బంది

రాజంపేటటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని కోర్టు ఆవరణాన్ని శనివారం ఉమ్మడి కడప జిల్లా జడ్జి యామిని పరిశీలించారు. ఎన్నో సంవత్సరాలుగా రాజంపేట కోర్టు ఆవరణంలో నూతన భవనం ఏర్పాటు, అదనపు గదులు, మరికొన్ని వసతుల ఏర్పాటు కోసం ఆమె స్థల పరిశీలన చేశారు. తహసీల్దారు కార్యాలయాన్ని కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్, సీనియర్ సివిల్‌జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్‌ప్రకాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు, ఉపాధ్యక్షురాలు సులోచనమ్మ, ఏజీపీ మౌనిక, తహసీల్దారు పీర్‌మున్నీ, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ కుమార్‌రాజు, టి.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు రామచంద్రయ్య, శ్రీనివాసులు, చంద్రమోహనొరెడ్డి, నాగేశ్వరచౌదరి, వీవీ రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా వేరుశనగ సాగు

- రైతులకు సహకరించని వర్షాలు
- ఆశ చావక విత్తన సాగులో రైతులు

వివరాలు 6లో...

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహించిన అనంతరం అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి సందర్భంగా శనివారం అమ్మవారికి ఉదయాన్నే అర్చన, అభిషేకాలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు శ్రీదేవి, భూదేవిలతో శాస్త్రోక్తంగా జరిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

- కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మండిపల్లి



కేంద్ర మంత్రి గడ్కరీ దంపతులను సన్మానిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని పలు జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. శనివారం తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద కేంద్రమంత్రిని మండిపల్లి మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. అలాగే ఎన్‌హెచ్-40 (రాయచోటిలో), ఎన్‌హెచ్-544జీ (ప్రొద్దుటూరు వద్ద) వంటి రెండు ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానిస్తుందన్నారు. ఈ రహదారిపై వాహనాల సంఖ్య (8422 పీసీయూల కన్నా ఎక్కువ) అధికంగా ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, మైదుకూరు, కడప, రాయచోటి, పీలేరు, చిత్తూరు వంటి ముఖ్యమైన పట్టణాల మీదుగా ఈ రహదారి వెళ్తుందన్నారు.

కోదండరామునికి స్నపన తిరుమంజనం



స్వామివారికి సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

ఒంటిమిట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామునికి శనివారం స్నపన తిరుమంజన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ స్వామివారి అభిషేకానికి సుగంధ ద్రవ్యాలను, పట్టువస్త్రాలు, పుష్పాలను అందజేశారు. మూలవిరాట్‌లకు ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శనివారం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు మధు, ప్రవీణ్‌కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు నామినేషన్ పత్రాలను ఈ నెల 8వ తేదీలోగా అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు 5న జరగనున్న టీచర్స్ డే (గురుపూజోత్సవం) సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించుకునే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఇందుకు గానూ జిల్లాలోని ఉపాధ్యాయులు ఈ నెల 8లోగా దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. అలాగే జిల్లా, డివిజన్, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సంబంధించిన మాన్యువల్ నామినేషన్ పత్రాలను తమ పరిధిలోని ఉప విద్యాశాఖ అధికారులకు సమర్పించాలని ఆయన సూచించారు.

రైతులకు వరం.. అన్నదాత సుఖీభవ

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, టీడీపీ నేతలు

చిన్నమండెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మండల సచివాలయం వద్ద అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకుడు (జేడీఏ) శివనారాయణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) వెంకటమోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు ప్రతి రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన ద్వారా రూ.6 వేలు కలిపి సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి విడతగా రూ.7 వేలు పంపిణీ జరగనుందని పేర్కొన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై ప్రసంగిస్తూ జీవామృతం, ఘన జీవామృతం, మల్చింగ్, పీఎండీఎస్ వంటి ప్రకృతి వ్యవసాయ విధానాల వలన నాణ్యమైన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లత, అగ్రికల్చర్ ఆఫీసర్ గీత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో భక్తుల సందడి

చక్రాయపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో రెండవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఎన్నడూ లేని విధంగా దాదాపు 50వేల మంది భక్తులు రావడం విశేషం. వచ్చిన భక్తులకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, కావలి కృష్ణతేజ, ఉత్సవ కమిటీ సభ్యులు కల్లూరు వెంకటస్వామి దగ్గరుండి సేవలందించారు. భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరడంతో సర్వ దర్శనం క్యూ దాదాపు కిలోమీటర్ వెళ్లింది. దర్శనానికి ఆరు గంటలు పట్టింది. ఉదయం 6 నుంచి రాత్రి 9గంటల వరకు భక్తుల రద్దీ నెలకొంది. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్ అంజన్నను పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గండి దేవస్థానంలో వివిధ రకాల సేవల ద్వారా వీఐపీ, స్పెషల్ దర్శనం, లడ్డూ ప్రసాదం, పులిహోర, కల్యాణకట్ట తదితర టికెట్ల ద్వారా రూ.19,50,838 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. కాగా వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎస్‌ఐ రంగారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థులు 600మంది భక్తులకు సేవలు చేశారు. డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

రూ.96 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపనలు

- మదనపల్లె- పీలేరు రోడ్డు జాతికి అంకితం



మదనపల్లె - పీలేరు జాతీయ రహదారి

రాయచోటి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ చేతుల మీదుగా జిల్లాలో రూ.96 కోట్ల రోడ్డు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. గుంటూరు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో శనివారం సాయంత్రం జాతీయ రహదారుల రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ చైర్మన్, హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల కోట్ల పెట్టుబడులతో 29 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు పునాది రాళ్లు వేయడం, ఇప్పటికే పూర్తయిన పలు పనులను జాతికి అంకితం చేసే కార్యక్రమం జరిగింది. సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో రూ.96 కోట్లతో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.1994 కోట్ల వ్యయంతో ఇప్పటికే పూర్తయిన మదనపల్లె, పీలేరు జాతీయ రహదారిని జాతికి అంకితం చేశారు.

రాయచోటి పట్టణంలో జాతీయ రహదారులు 40, 440 మధ్య బైపాస్‌లో రోడ్డు విస్తరణ చేయనున్నారు. రెండు కి.మీ. మేర జరిగే ఈ పనిని రూ.17కోట్లతో చేపట్టనున్నారు. రెండు జాతీయ రహదారుల మధ్య లింకు రోడ్డును చదును చేసి 2లేన్లుగా విస్తరించనున్నారు. ఇందులో బైపాస్ 1, బస్‌షెల్టర్లు 2, జంక్షన్లు రెండు ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. అదేవిధంగా తంబళ్లపల్లె నియోజకవర్గం చిన్నతిప్పసముద్రం గ్రామంలో జాతీయ రహదారి 71లో రూ.79 కోట్లు వ్యయం చేసి రెండు కి.మీ. రెండు లేన్ల ఆర్‌వోబీ నిర్మాణం చేయనున్నారు. ఇందులో కల్వర్టులు 6, ఆర్‌సీసీ డ్రైన్, ఫుట్ పాత్ మూడు కి.మీ., రిటైనింగ్ వాల్ 441 కి.మీ. చేపట్టనున్నారు. దీనివల్ల చిన్నతిప్పసముద్రం గ్రామ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయడం, రైల్వేలెవల్ క్రాసింగ్‌ను తొలగించి.. ప్రయాణ సమయాన్ని తగ్గించగలుగుతారు.

జాతికి అంకితమైన మదనపల్లె- పీలేరు రోడ్డు

ఇప్పటికే మదనపల్లె నుంచి పీలేరు సెక్షన్ ఎన్‌హెచ్ 71 నాలుగులైన్ల రోడ్డు విస్తరణ 56 కి.మీ. మేర రూ.1994 కోట్ల ఖర్చుతో పూర్తయ్యాయి. ఇందులో మూడు బైపాస్‌లు, (34.99 కి.మీ.) రీ అలైన్‌మెంట్లు 3, సర్వీసు రోడ్డు 63.76 కి.మీ., ట్రక్‌లేబేలు 2, బస్ షెల్టర్లు 21, ప్రధాన వంతెనలు 19, చిన్న వంతెనలు 12, టోల్‌ప్లాజా 1 ప్రధాన జంక్షన్లు 8, చిన్నవి 31 నిర్మాణం పూర్తి చేశారు. దీనివల్ల మదనపల్లె, తిరుపతి, హార్సిలీహిల్స్ కొండల మధ్య సరైన రోడ్డు సౌకర్యం ఏర్పడనుంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య వేగవంతమైన, సున్నితమైన అంతరాష్ట్ర ప్రయాణం జరగనుంది. అదేవిధంగా తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి దేవస్థానం, కదిరి నరసింహస్వామి దేవస్థానం, బోయకొండ గంగమ్మ వంటి మతపరమైన ప్రదేశాలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం ఏర్పడనుంది. హార్సిలీ హిల్స్, తలకోన జలపాతాలు పర్యాటక ప్రదేశాలకు, మదనపల్లె ప్రాంతం నుంచి ఉద్యానవన ఉత్పత్తులకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు ప్రయాణ సమయంలో 30 నిమిషాలు తగ్గనుంది. ఈ రోడ్డును గడ్కరీ జాతికి అంకితం చేశారు.

ప్రశ్నార్థకంగా వేరుశనగ సాగు

● పదును లేని వర్షం.. అదును కాని సాగు ● ఆశ చావక విత్తన సాగు

సంబేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా వర్షాధారం కింద సాగు చేసే పంట వేరుశనగ. జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 90 వేల నుంచి లక్ష హెక్టార్లపైన వేరుశనగ సాగు చేసేవారు. గత ఏడాది పరిశీలిస్తే ఖరీఫ్‌లో 40 వేల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైంది. ఏ ఏడుకాయేడు వేరుశనగ సాగు తగ్గుతూ వస్తోంది. సంబేపల్లె మండలంలో 2023లో 1280 హెక్టార్లు సాగు చేశారు. 2024లో 980 హెక్టార్లలో, ఈ ఏడాది 180 ఎకరాలు మాత్రమే సాగు చేపట్టగా ఆగస్టు 15 నాటికి సాగు గడువు ముగియనుంది. ఒకప్పుడు గ్రామాల్లో 80 నుంచి 90 శాతం వేరుశనగ పంట సాగు చేసే రైతులు ప్రస్తుతం 10 నుంచి 20 శాతం కూడా కనిపించడం లేదు. రైతులపై ప్రకృతి తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇలా అయితే వేరుశనగ సాగు ప్రశ్నార్థకమేనని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



కొండ్రువాండ్లపల్లె వద్ద ఇటీవల కురిసిన వర్షానికి దుక్కి చేసిన పొలం



ఆశ వీడక విత్తన సాగు చేస్తున్నరైతులు



గాండ్లపల్లె వద్ద దుక్కి చేయని పొలం

అదునులోనూ లేని పదును

ఏరువాక అదును (ఖరీఫ్ సాగు) ఆరుద్ర, పెద్ద పుష్యమి, చిన్న పుష్యమి. ఈ మూడు కార్తెలు ఏరువాక వేరుశనగ సాగుకు అనువైన కార్తెలు, ఆరుద్ర, పెద్ద పుష్యమి కార్తెల్లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. చిన్నపుష్యమి కార్తెలో కూడా సాగు చేయవచ్చు కానీ ఆశించిన దిగుబడి రాదని చెబుతుంటారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15వరకు వేరుశనగ సాగు సమయం.. ఆ తర్వాత పంట సాగు చేయరు. జూన్‌లో పంట సాగు చేపట్టాలంటే మే నెలలో వర్షాలు కురవాలి. పంటలు దుక్కి చేసుకోవడానికి వర్షాలు పడితే తప్ప సాగు చేపట్టలేరు. ఈ ఏడాది రుతుపవనాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఎక్కడపడితే అక్కడ ఓ మోస్తారు వర్షాలు తప్ప సరైన పదును లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పొలాలు దున్నినా చాలాచోట్ల ఇప్పటికీ దున్నకాలు చేపట్టలేదు. మండల వ్యాప్తంగా పలుచోట్ల కొందరు రైతులు ధైర్యం చేసి వేరుశనగ సాగు చేస్తున్నారు.

రైతుల్లో కనిపించని ఉత్సాహం

శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లెలో సుమారు 85 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ వ్యవసాయ పొలం ఉంది. గతంలో ప్రతి రైతు తనకున్న పొలంలో వేరుశనగ పంట సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ ఊరిలో 10 కుటుంబాలు కూడా వేరుశనగ పంట సాగు చేయడం లేదు. ప్రకృతి విపత్తులు, వరుస నష్టాల వల్ల సాగుకు దూరమైపోయారు. ఏ రైతును పలకరించినా వేరుశనగ సాగు చేయాలంటే వర్షాలతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఒకప్పుడు వేరుశనగ విత్తన కాయల కోసం రిలీజ్ సినిమా టికెట్ల కోసం ఎగబడినట్లు విత్తన కౌంటర్ల వద్ద రైతులు బారులు తీరి విత్తనకాయల కోసం ఎగబడేవారు. అయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల గత ఐదారు సంవత్సరాలుగా పంట సాగు చేయడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగకాయలు అందిస్తోంది. సంబేపల్లె మండలానికి 1650 క్వింటాళ్లు మంజూరు చేశారు. అయితే విత్తనాల కోసం రైతులు మక్కువ చూపడం లేదు. అరకొర సాగు చేసిన రైతులు మార్కెట్‌లో లభించే విత్తన కాయలను కొనుగోలు చేస్తున్నారు. అతి తక్కువ మంది రైతులు మాత్రమే వేరుశనగ సబ్సిడీ కాయలను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అరకొర వర్షానికి ఆశ చావక కొంతమంది రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు.

ఒకప్పుడు ఊరంతా సాగు చేసేవాళ్లం..



మా ఊరిలో ఒకప్పుడు ఊరంతా వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేసేవారం. అప్పట్లో కలుపు తీసేందుకు కూలీలకు ఎక్కువ డిమాండ్ ఉండేది. ఇప్పుడు వర్షాలు కురవకపోవడంతో ఊరంతా కలిపినా 10 కుటుంబాలు కూడా వేరుశనగ సాగు చేయడం లేదు. ప్రకృతి ప్రభావం ఇలాగే ఉంటే రాను రాను వేరుశనగ సాగు కష్టమే. దేవుడి మీద భారం వేసి 3 ఎకరాలు వేరుశనగ సాగు చేశాను. 45 రోజులు గడిచింది. ఒకసారి గడ్డి కలుపు తీశాము. ఒక ఎకరాకు 20 నుంచి 25 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాము. పంట బాగా పండితే తప్ప లాభాలు రావడం లేదు.

- బొంగా కృష్ణారెడ్డి, రైతు, గాండ్లపల్లె

'అన్నదాత సుఖీభవ'ను సద్వినియోగం చేసుకోండి : సబ్ కలెక్టర్



రైతులకు అన్నదాత సుఖీభవ పథకం చెక్కు అందిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకం కింద రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని రైతులకు మొదటి విడతగా 20,162 మంది రైతులకు రూ.14.11కోట్లు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గురుమూర్తి గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు వేసి మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ మొదటి విడతగా రూ.7వేలు, రెండో విడత రూ.7వేలు, మూడో విడత రూ.6వేలు మొత్తం కలిపి రూ.20వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్, టీడీపీ నేతలు విద్యాసాగర్, మధుబాబు, సిమెంట్ రమణ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఓబులవారిపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబులవరిపల్లెలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన మిగిలి ఉన్న కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.దేవరాజ్ తెలిపారు. పదో తరగతి పాసైన వారు, పాలీసెట్ 2025లో రాసినవారు, రాయని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో ఈనెల 5న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌లో సీటు పొందిన అభ్యర్థులు అదేరోజు కాలేజీలో వివిధ ఫీజుల కింద రూ.5800 నగదు, ఒరిజనల్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీట్లు పొందినవారికి ఎటువంటి స్కాలర్‌షిప్ రావని ప్రిన్సిపాల్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మోర్‌సింగ్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డులో ప్రమాదవశాత్తు లారీ ఢీకొని మృతి చెందిన కూలీ కుటుంబానికి టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రూ.2లక్షల ఆర్థికసాయం అందించింది. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో నగదును అందించారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ మాట్లాడుతూ మార్కెట్‌లో లారీ వెనక్కి వస్తుండగా కూలీగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోర్‌సింగ్ లారీ ఢీకొని గత నెలలో మృతి చెందాడన్నారు. అప్పట్లోనే హమాలి వర్కర్స్ స్పందించి మోర్‌సింగ్ భౌతికకాయాన్ని ఉత్తరప్రదేశ్‌కు పంపారన్నారు. టీఎన్‌టీయూసీ ముందుకొచ్చి హమాలీ యూనియన్, మండీ వర్కర్స్, వ్యాపారులు, లారీ వర్కర్స్ యూనియన్ కలసి రూ.2లక్షల నగదు సేకరించామని, ఈ మొత్తాన్ని మోర్‌సింగ్ కుటుంబీకులకు అందించామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రామయ్య, ఉపాధ్యక్షుడు రసూల్, కార్యదర్శి మహబూబ్‌బాషా, మురాషా, షామీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులు తప్ప ఇతరులకు పాఠశాలల్లో ప్రవేశం లేదంటూ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించేలా విద్యాశాఖ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు విద్యాసంస్థల్లో జరిగే అన్యాయాలను బహిర్గతం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే విద్యార్థి సంఘాలకు ఇలాంటి ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఆ ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి ఆహ్వానం

వాల్మీకిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొత్త ఇందిరమ్మ కాలనీలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీహెచ్ చంద్రకళ పేర్కొన్నారు. ఎస్సీ విభాగానికి మిగులు సీట్లు ఖాళీ ఉన్నాయని విద్యార్థులు సద్వియోగం చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 25ఖాళీలు, 7వ తరగతిలో 3ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత గల విద్యార్థులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుల సమాచారంతో నేరుగా పాఠశాలలో సంప్రదించాలన్నారు.

లారీ, ఆటో ఢీ : ఒకరి మృతి

● ఐదుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ఆటో

రాజంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం బోయనపల్లె సమీపంలో శనివారం లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో రాజంపేట పట్టణం రామ్‌నగర్‌లో నివాసం ఉండే నాగారం లక్ష్మీదేవి(46) మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వివరాల్లోకి వెళితే... నందలూరులో సౌమ్యనాథస్వామిని దర్శించుకుని రాజంపేటకు వస్తున్న ఆటోను తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రామ్‌నగర్‌కు చెందిన నాగారం దివ్య, ఓబులవారిపల్లెకు చెందిన తోట గగన్, మౌనిక, వెంకటరమణ, శేషమాంబపురానికి చెందిన సాంబయ్యకు తీవ్ర గాయలయ్యాయి. ఈ మార్గంలో వెళుతున్న ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే ప్రమాద సంఘటనను గమనించి వెంటనే గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

● పోలీసులకు ఫిర్యాదు చేసిన వివాహిత

పీలేరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఓ వివాహిత శనివారం పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు... పీలేరు మండలంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వివాహితకు ఇద్దరు కుమార్తెలు. తన భర్త ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ క్రమంలో ముడుపులవేముల పంచాయతీ రాణావడ్డిపల్లెకు చెందిన యల్లమంద శ్రీనివాసులు తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త చనిపోక మునుపు సైతం తమ ఇంటికి వచ్చి లైంగికంగా వేధించేవాడని, తన భర్త చనిపోవడానికి ఇతనే కారణమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 1వ తేదీన శుక్రవారం రాత్రి సుమారు 7గంటల ప్రాంతంలో తన ఇంటికి వచ్చి పనుల విషయమై మాట్లాడాలని పిలిచి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని, గట్టిగా అరవడంతో అత్తమామ అనసూయ, రమణయ్య, మరికొందరు అతని బారి నుంచి కాపాడారని తెలిపారు. ఈ విషయమై రాణావడ్డిపల్లె ఆలయం వద్ద జరిగిన పెద్దమనుషుల పంచాయితీలోనూ తనతో దురుసుగా ప్రవర్తించడంతో అతనికి దేహశుద్ధి చేశారని తెలిపారు. తనను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న శ్రీనివాసులు నుంచి రక్షణ కల్పించాలని కోరగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

సుండుపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన గోవిందు రామయ్య (39) శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శుక్రవారం రాయచోటి నుండి స్వగ్రామం రాయవరం గ్రామ పంచాయతీ కావలిపల్లికి వెళ్తుండగా సుండుపల్లి రాయచోటి ప్రధాన రహదారి రాచంవాండ్లపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనం నుండి కిందపడి గాయాలపాలయ్యాడు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత...

బి.కొత్తకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొటుకు పంచాయతీ పులుసుమానిపెంటలో భర్తపై కోపంతో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పులుసుమానిపెంటలో నివాసం వుంటున్న శివశంకర్, లక్ష్మీదేవి(42) దంపతులకు జగదీష్, రజిత సంతానం. మద్యానికి బానిసైన శివశంకర్‌తో తరచూ గొడవ పడే లక్ష్మీదేవి శుక్రవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వున్న విషద్రావణాన్ని తాగింది. గమనించిన స్థానికులు సమీపంలో వున్న కర్నాటక గ్రామం రాయల్పాడుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మదనపల్లెకు, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. రుయాలో చికిత్స పొందుతూ లక్ష్మీదేవి శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి



వెంకటరత్నం మృతదేహం

కలకడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీ లక్ష్మీపురం సమీపంలో శనివారం రాత్రి అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇరువురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. దేవళపల్లికి చెందిన డ్రైవర్ నాగరాజనాయుడు, కూలీలు అదే గ్రామం దిగువ దళితవాడ వాసి వెంకటరత్నం (36), గుర్రంకొండ మండలం మర్రిమాకులపల్లికు నరసింహులు (52) ట్రాక్టర్‌లో ఓ రైతుకు టామోట కట్టెలను తోలుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో లక్ష్మీపురం సమీపంలోకి రాగానే అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాలీలో కట్టెలపై కూర్చొని వున్న వెంకటరత్నంపై లోడు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయలపాలైన డ్రైవర్ నాగరాజనాయుడు, నరసింహులును చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన మునస్వామి శెట్టి

రామసముద్రం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక సరిహద్దులోని పెగలపల్లికి చెందిన మునస్వామిశెట్టి(62) మండలంలోని గెవి తిమ్మరాయస్వామి ఆలయానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రామసముద్రం-పుంగనూరు రోడ్డు మార్గంలో గాంధీనగర్ వద్ద ఉన్న గుంతను తప్పించబోయి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన గుంతకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యాటకుల రక్షణకే ప్రాధాన్యం

● హార్సిలీహిల్స్‌పై డీఎస్పీ ముమ్మర తనిఖీలు ● శాంతిభద్రతలపై కీలక ఆదేశాలు



గాలిబండపై పరిశీలిస్తున్న పోలీసు బృందం



రిసెప్షన్‌లో విచారిస్తున్న డీఎస్పీ మహేంద్ర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బి.కొత్తకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్ పరిధిలో పర్యాటకుల రక్షణకే ప్రాధాన్యత ఉంటుందని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై డీఎస్పీ మహేంద్ర 50మంది పోలీసు సిబ్బందితో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పోలీస్ భవనానికే దిక్కులేదు.. పర్యాటకుల రక్షణ ఎలా? అనే శీర్షికన వెలువడిన వార్తాకథనానికి ఆయన స్పందించారు. ఇద్దరు సీఐలు, 5మంది ఎస్‌ఐలతో సహా 50మంది సిబ్బందితో హార్సిలీహిల్స్ మొత్తాన్ని జల్లెడ పట్టారు. ఏపీ టూరిజం రిసార్ట్స్, హోటళ్లు, ప్రైవేటు లాడ్జీ లను పరిశీలించి రూములు అద్దెకు ఇచ్చే సమయంలో పర్యాటకుల నుంచి తగిన ఆధారాలు తీసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వరాదని హెచ్చరించారు. వ్యూపాయింట్ వద్ద జాగ్రత్తగా వుండాలని, ద్విచక్రవాహనాలలో కొండపైకి వచ్చేవారు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలీసు హెల్ప్‌డెస్క్ భవనం దుర్వినియోగం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత కారణంగా హెల్ప్‌డెస్క్‌లో పోలీసులను రెగ్యులర్‌గా పెట్టలేకపోయామని, ఇకపై అందుబాటులో వుండేలా చూస్తామన్నారు. ప్రైవేటు రెస్టారెంట్ల యాజమాన్యం నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట స్థానిక సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు, సిబ్బంది వున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

వాల్మీకిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని వాల్మీకిపురం మండల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ అన్నారు. శనివారం నమాజ్ కట్టవీధి ఉర్దూ పాఠశాలలో పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1000మంది బాలురకు 926 మంది బాలికలు ఉన్నారన్నారు. ఆడపిల్ల అయినా మగ బిడ్డ అయినా సమానంగా చూడాలన్నారు. గర్భిణి సమయంలో స్కానింగ్ కేవలం పిండం ఆరోగ్య పరిస్థితి కోసమేనని, ఈ విషయాన్ని తల్లులు గమనించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమృత, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ

దొడ్డిపల్లె వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లెలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ (డీపీహెచ్ఎన్ఓ) శోభాలత, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మునీశ్వర్ వెల్‌నెస్ సెంటర్‌లోని గర్భిణుల నమోదు, హిమోగ్లోబిన్, కాన్పులు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ తదితర రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శివరామాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి పోషక విలువలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేగళ్లు వైద్యాధికారి రాధామాధవి, హెచ్ఈ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండమ్మకు కుంకుమార్చన

సుండుపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బోయకొండమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మొదటి రోజు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నుండి మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారంతో ముగుస్తాయన్నారు. అందులో భాగంగా శనివారం గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

పులివెందుల జడ్పీటీసీని గెలుస్తాం

● ఐకమత్యంతో ముందుకు సాగుతాం : ఎమ్మెల్యే ఆది ● కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత : బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. శనివారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని ఆరు పంచాయతీల నాయకులతో పంచాయతీల వారీగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి కనీసం పులివెందులను కూడా అభివృద్ధి చేయలేని స్థితిలో పాలన సాగించారన్నారు. ప్రజలకు అవసరమైన పనులు కూడా చేయలేకపోయారన్నారు. ఈరోజు ఆయా పంచాయతీల నాయకులతో మాట్లాడుతుంటే అనేక సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. 600 రోజుల క్రితం నేను పులివెందులకు వచ్చానన్నారు. అప్పటికి ఇప్పటికి ఎంతో మార్పు వచ్చిందన్నారు. వైఎస్ జగన్, అవినాష్‌రెడ్డి చేసిన తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసు తమపై పెట్టేందుకు ప్రయత్నించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వైసీపీ చేస్తున్న తప్పులను వివరిస్తామన్నారు. పోలీసులకు, మాకే పోటీ అని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అంటున్నారని, టీడీపీ, కాంగ్రెస్, స్వతంత్రులు తదితరులు నామినేషన్ దాఖలు చేసి పోటీలో ఉన్నారని, దీంతో ఆయన చెప్పినట్లు ఇక్కడ సాగదన్నారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. ఈరోజు పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పార్టీలోకి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఒక కుటుంబాన్నే ఆదరిస్తున్నారన్నారు. రైతులు సాగుచేసే సమయంలో పంట మార్పిడి చేసే విధంగా ఇక్కడ కూడా ఈ పద్ధతి తేవాలన్నారు. అనంతరం పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 2006 వరకు నేను టీడీపీలోనే ఉండేవాడినని, అప్పుడు సతీష్‌రెడ్డి వ్యవహారశైలి నచ్చక కాంగ్రెస్‌లో చేరానన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎల్‌సీ ఛైర్మన్ జోగిరెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, పుష్పనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో ఇన్‌చార్జీల పాలనకు త్వరలో విముక్తి

యోగివేమన యూనివర్సిటీ



● కొత్త వీసీ నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు
● సెర్చ్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇన్‌చార్జిల పాలనకు త్వరలో విముక్తి కలగనుంది. వైస్ చాన్సలర్ నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపధ్యంలో సెర్చ్ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో యోగివేమన యూనివర్సిటీలో గత సంవత్సరం కాలం నుంచి ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌లను నియమించింది. 2024 జూలై 19న ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. సుమారు 7 నెలలపాటు ఇన్‌చార్జి పాలన కొనసాగింది. విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రెగ్యులర్ వీసీగా సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ప్రణితి ప్రకాష్‌బాబును నియమించింది. అయితే ఆయనను పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వీసీగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రకాష్‌బాబును రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు విక్రమ్‌సింహపురి యూనివర్సిటీ వీసీగా పనిచేస్తున్న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును వైవీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా నియమిస్తూ గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మార్చి 16వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి మళ్లీ ఇన్‌చార్జిపాలనలో యోగివేమన యూనివర్సిటీ కొనసాగుతోంది.

ప్రస్తుతం సెర్చ్ కమిటీని ప్రభుత్వం నియమించడంతో వైవీయూ రెగ్యులర్ వీసీ మరో పది రోజుల్లో వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

సెర్చ్ కమిటీ నియామకం

వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీ సూచనలు ఇస్తుంది. ఈ నేపధ్యంలో ఈనెల 30వ తేదీ సెర్చ్ కమిటీ సభ్యులను నియమిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు విడుదల చేశారు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీ తరపున సర్దార్‌పటేల్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేవదత్‌శర్మ నియమితులయ్యారు. ప్రభుత్వం తరపున ఆదికవి నన్నయ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ పి.జార్జ్ విక్టర్‌ను, వర్సిటీ పాలకమండలి తరపున రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ కేవీ ప్రసాద్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ఆచార్యుల అనుభవం, నైపుణ్యాలు, పరిశోధనలు, ప్రచురణలు తదితర అంశాలను పరిశీలించి ఉన్నత విద్యామండలికి సూచనలు ఇస్తారు. అనంతరం గవర్నర్ ఉపకులపతులను నియమిస్తారు. ఈ నియామకాలు మరో వారంలోగా పూర్తిచేసే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు, ఆచార్యులు భావిస్తున్నారు.

ముమ్మర ప్రయత్నాలు

వీసీ పదవుల కోసం వైవీయూలో పలువురు ప్రొఫెసర్లు దరఖాస్తు చేశారు. ఇందులో కొందరు రిటైర్డ్ ప్రొఫెసర్లు కూడా ఉన్నట్లు సమాచారం. వైస్ చాన్సలర్ పదవి దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు పదుల సంఖ్యలో ఆశావహులు ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మరో పది రోజుల్లో రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియమితులయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం తెలియజేస్తున్నారు.

నిరాధార ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చవద్దు

యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిరాధార ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చవద్దని యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం అధ్యక్షుడు ఆచార్య ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎం.వినోదిని సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా నిందలు మోపడం తగదన్నారు. విశ్వవిద్యాలయంలో కాన్వకేషన్ నిర్వహించడానికి రెండేళ్ల క్రితం ప్రొఫెసర్ చింతా సుధాకర్ ఉప కులపతిగా ఉన్న సమయంలో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. సుమారు 13000 మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాల కోసం ఈ పట్టాల అవసరం ఉందని విద్యార్థులు పదేపదే అధికారులకు విన్నవిస్తున్న నేపథ్యంలో కాన్వకేషన్ వెంటనే జరపా లని విశ్వవిద్యాలయం నిర్ణయించిందన్నారు. అందుకు అనుగుణంగానే విశ్వ విద్యాలయం పనులు ప్రారంభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజర వుతున్నందున కాన్వనకేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయం తీసుకు న్నారని తెలిపారు. కాన్వకేషన్ నిర్వహణకు అవసరమైన జర్మన్ షెడ్లు వేయ డానికి, గోల్డ్ మెడల్స్ తయారు చేయించడానికి ఇ-టెండర్ల ద్వారా కొటేషన్స్ కోరడానికి నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు. వీటిలో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పాత్ర ఏమాత్రం లేదని, స్వలాభం కోసం పక్షపాత దృష్టితో కొంతమంది పనిగట్టుకొని విశ్వవిద్యాలయ అధికారుల మీద బురదజల్లాలని ప్రయత్నించినట్లు తెలుస్తోందన్నారు.

వైవీయూ డిప్లమో కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు యూనివర్శిటీ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ తెలిపారు. జర్నలిజంశాఖ ఆధ్వర్యంలో పీజీ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తు న్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఏదేనీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని సూచించారు. సాయంకాలం తరగతులు కావడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతర వృత్తుల్లో ఉన్న వారు, పీజీస్థాయి కోర్సులు చదువుతున్న వారు కూడా ఇందులో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీలో పీజీ కళాశాలలోని ఎంబీఏ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం ఈనెల 5వ తేదీ ఉదయం 11గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్ అలైడ్ బ్రాంచెస్), ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) అర్హతల కలిగి ఉండాలన్నారు. ఎంబీఏ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పేపర్లను, అనుబంధ అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్లాక్ చైన్ టెక్నాలజీ, ప్రోగ్రామింగ్ ఇన్ ఆర్, మిషన్ లెర్నింగ్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, డేటావేర్ హౌసింగ్ అండ్ మైనింగ్, బిజినెస్ అనలిటిక్స్, పవర్ బీఐ, డీబీఎంఎస్, డేటా విజువలైజేషన్‌లలో బోధించేవారు కావాలన్నారు. అర్హత ఉన్న ఆసక్తిగల అభ్య ర్థులు బయోడేటా, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు.

ఆర్‌ఎస్‌కేలో రూ.4.70 లక్షలు స్వాహా

● పోలీసు ఫిర్యాదుకు అధికారుల సన్నద్ధం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివశంకర్ సుమారు రూ.4.70 లక్షలు స్వాహా చేశారు. గత రబీ సీజన్ చివరి దశలో కల్లూరు రైతు సేవా కేంద్రానికి సరఫరా అయిన ఎరువులు, విత్తనాలను రైతులకు అందించి ఆ మొత్తాలను వసూలు చేశారు. ఈ సొత్తును ప్రభుత్వానికి చెల్లించకుండా సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు. స్వాహా చేసిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా ఇటు విధులకు హాజరుకాకుండా జనవరి నెల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అప్పట్లో ఈ విషయంపై స్థానిక వ్యవసాయ అధికారులకు తెలిసి పలుమార్లు హెచ్చరించినా అదిగో కడుతాను. ఇదిగో కడుతాను అంటూ విధులకు హాజరవ్వడం మానుకున్నాడు. ఈ విషయమై ప్రస్తుత వ్యవసాయశాఖ అధికారి వరహరి కుమార్‌ను వివరణ కోరగా.. తాను ఇక్కడకు రాకముందే చోటు చేసుకున్న నగదు స్వాహా విషయమై జిల్లా ఉన్నతాధికారులు గుర్తించారన్నారు. వీఏఏ శివశంకర్ గురించి వాకబు చేయగా జనవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని చెప్పారు. విత్తనాలు, ఎరువుల డబ్బులను సుమారు రూ.4.70 లక్షలను స్వాహా చేయగా.. అతను అందుబాటులో లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులను సొంత ప్రయోజనాలకు వాడుకున్న వైనంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏవో వివరించారు.

నల్సాపథకంపై శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప న్యాయసేవ సదన్‌లో శనివారం నల్సాపథకం-2025పై జిల్లా ప్రధాన జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఛైర్మన్ డాక్టర్ సి.యామిని అధ్యక్షతన జిల్లా జాగృతి యూనిట్ సభ్యులకు శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సహాయం పొందడంలో సవాళ్లు, న్యాయ సహాయం కోసం చట్టపరమైన అవగాహన, ప్రాముఖ్యత, ప్రస్తుత చట్టపరమైన నిబంధనలు, స్థానిక సంస్థల ద్వారా న్యాయసహాయం అవగాహనను సంస్థాగతీకరించడానికి ఒక పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పథకం లక్ష్యాలు, జిల్లా తాలూకా యూనిట్ల స్థాపన, చట్టపరమైన అవగాహన వ్యాప్తి విధానం, న్యాయసేవల ప్రదాతలు, సంస్థల బాధ్యతలు, నివేదిక, పర్యవేక్షణ, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు గరికపాటి దీనబాబు, ఎన్.శాంతి, జి.రమేష్‌కుమార్, ఎస్.బాబాఫక్రుద్దీన్, రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కడప డీఎస్‌పీ వెంకటేశ్వర్లు, కడప అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కె.రాకేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్లు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు పాలిసెట్ పరీక్షల్లో ర్యాంకు రాకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీటుకోసం వచ్చే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకు రావాలని, ఫీజు కేవలం ఏడాదికి రూ.6వేలు అని తెలిపారు. వివరాలకు 9010222172, 9490378886 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేటి నుంచి స్పెల్-2 ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానందరాజులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పీజీటీలకు ఆదివారం నుంచి ఐదురోజుల పాటు స్పెల్-2 ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజులు పేర్కొన్నారు. శనివారం కడప నగరం సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగర పరిధిలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో కేజీబీవీ పీజీటీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ) సబ్జెక్టు టీచర్లకు స్పెల్-2 ఇన్ సర్వీస్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 119 మంది ఫిజిక్స్ పీజీటీలు, 119 మంది కెమిస్ట్రీ పీజీటీలు, 21 మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులను అధికారులు పర్య వేక్షించాలని సూచించారు. సూపరింటెండెంట్ ప్రేమకుమారి, జీసీడీఓ రూత్‌ఆరోగ్యమేరి, ఏఎంఓ వీరేంద్రయాదవ్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

జోనల్ త్రో బాల్‌లో సత్తా చాటిన హెచ్‌పీఎస్



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న రామసుబ్బారెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప నగర రిమ్స్ సమీప హైదరాబాదు పబ్లిక్ స్కూలులో శనివారం జరిగిన ఏపీ, తెలంగాణ ఆరు జోన్లకు చెందిన జోనల్ త్రో బాల్ టోర్నమెంటులో హైదరాబాదు పబ్లిక్ స్కూలు విద్యార్థులు సత్తాచాటారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి హాజరై తొలుతక్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన అండర్ 17 బాలికల విభాగంలో జాన్‌బీ హైదరాబాదు పబ్లిక్ స్కూలు (కడప జట్టు) మొదటిస్థానం సాధించి స్వర్ణపతక విజేతగా నిలిచింది. అలాగే అండర్ 14 బాలికల విభాగంలో జోన్ బీ హైదరాబాదు పబ్లిక్ స్కూలు కడప జట్టు కాంస్య పతకం అందుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమిత్‌సింగ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చెల్లాచెదురుగా పడిన బొలెరో వాహనంలోని మామిడిపండ్లు

సీకేదిన్నె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో జమాల్‌పల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... లక్కిరెడ్డిపల్లె నుంచి కడపకు మామిడి పండ్ల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొంది. దీంతో పఠాన్ మౌలాలి, నూర్‌బీ అనే ఇరువురు తీవ్రగాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి హైడ్రాలిక్ కట్టర్‌తో క్యాబిన్ తొలగించి బయటికి తీసి చికిత్స నిమిత్తం 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



దువ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆకుల నాగజ్యోతి(27) శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. ఈమేరకు ఆమె భర్త హరి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాలనీ సమీపంలో ఉన్న కేసీ కాలువ వద్ద ఆమె ధరించిన చున్నీ కనిపించడంతో ఆత్మహత్యకు ఏమైనా పాల్పడిందా అనే కోణంలో విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ భూషణం తెలిపారు. ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు భర్త పోలీసులకు తెలిపారు.

గండికోట ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయిర్ నుంచి కృష్ణా జలాలు వస్తుండటంతో గండికోట ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. శనివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 9,000 క్యూసెక్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీ ఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 300 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 10.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

వెల్లాల చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవిల గ్రామోత్సవం

రాజుపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవంలో భాగంగా రెండో శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాలో చెన్నకేశవ, శ్రీదేవి భూదేవిల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివార్ల గ్రామోత్సవం మహిళలు భజనల మధ్య కోలాహలంగా సాగింది. అదేవిధంగా సంజీవరాయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అలంకరణ గావించి పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ట్రిపుల్‌ఐటీ మెస్‌లు అక్షయపాత్రకు అప్పగింత

● 24వేల మంది విద్యార్థులకు భోజనం సరఫరా
● ఇడుపులపాయలో పరిశీలించిన అక్షయపాత్ర ప్రతినిధులు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చదువుతున్న 24వేల మంది విద్యార్థులకు ఇక నుంచి అక్షయపాత్ర సంస్థ ద్వారా భోజనం అందించనున్నారు. ప్రభుత్వ సూచన మేరకు ఆర్జీయూకేటీ అధికారులు అక్షయపాత్రకు ఎల్‌ఓసీ ఇచ్చారు. ఇడుపులపాయలో 4, నూజివీడులో 4, శ్రీకాకుళంలో 2, ఒంగోలులో 2 మెస్‌లను త్వరలో అక్షయపాత్ర ద్వారా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు వివిధ కంపెనీల ద్వారా నిర్వహించేవారు. పలు సందర్భాల్లో విద్యార్థులు భోజనం నాణ్యంగా ఉండడం లేదని ఫిర్యాదులు, ఆందోళనలు చేశారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మెస్‌లను అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలు అక్షయపాత్రకు అప్పగించాలని సూచించారు. ఈ మేరకు 12 మెస్‌లను నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. 15 రోజుల్లోగా ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లను అక్షయపాత్ర స్వాధీనం చేసుకొని భోజనం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లను అక్షయపాత్ర ప్రతినిధులు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు భోజనం అందించేందుకు ఎలాంటి సౌకర్యాలు,వసతులు ఉండాలన్న విషయాలపై పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ట్రిపుల్‌ఐటీ అధికారులతో చర్చించారు. అక్షయపాత్ర ద్వారా శాఖాహారభోజనం మాత్రం అందిస్తుండగా మాంసాహార భోజనాన్ని అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులను భాగస్వామ్యం చేయడమా లేక కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలనే విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ట్రిపుల్‌ఐటీ అధికారి ఒకరు తెలిపారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని మెస్-2 వద్ద విద్యార్థినులు

అన్నంలో పురుగులొస్తున్నాయి..

● ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆవేదన... నిరసన

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నం సక్రమంగా ఉండడం లేదు...ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు.. ఒక్కోసారి పురుగులు వస్తున్నాయి... ఎలా తినాలంటూ ట్రిపుల్‌ఐటీలో పీయూసీ చదువుతున్న విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పాత క్యాంపస్‌లో జైస్వాల్ కంపెనీ ఆధ్వర్యంలో మెస్ నిర్వహిస్తున్నారు. ఓల్డ్ క్యాంపస్‌లో ఉన్న పీయూసీ బాలికలకు, కొత్త క్యాంపస్‌లో ఉన్న పీయూసీ బాలురకు భోజనం సరఫరా చేస్తారు. కొత్త క్యాంపస్‌లో ఉన్న పీయూసీ విద్యార్థులు శనివారం రాత్రి హాస్టల్ గదుల నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించి నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులు అక్కడకు చేరుకొని సరైన భోజనం అందేలా చూస్తామని సర్ది చెప్పడంతో నిరసన విరమించినట్లు ఏఓ పెనుగొండ రవికుమార్ తెలిపారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాతకు గత వైసీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద తక్కువగా ఇస్తున్నారని, అయితే కూటమి ప్రభుత్వం ఎక్కువగా ఇస్తోందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5000, కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.2000 ఇస్తున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ విషయంలో చెప్పిన మాట చెప్పినట్లు కూటమి ప్రభుత్వం ఇస్తోందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతి ఏటా రూ. రైతుల ఖాతాల్లో రూ.20,000 జమ అవుతుందన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో రూ.24,622 మంది రైతులకు రూ.17.24 కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఇటీవల మామిడి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. అలాగే బొప్పాయి రైతులకు కలెక్టర్‌తో మాట్లాడి రైతులు, దళారులు, మార్వాడీలతో చర్చలు జరిపి టన్నుకు రూ.9000 తగ్గకుండా చేశామని వారు స్పష్టం చేశారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ప్రజల్లోకి వెళ్లినప్పుడు చాలా సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రజలు పేదరికం నుంచి బయటపడాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచించి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే వారందరికీ ఒక్కొక్కరికి రూ.13,000 అందిస్తున్నారన్నారు. అలాగే ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. అనంతరం రైతులకు మినుము విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మణి, ఏవోలు సందీప్, మల్లిక, సుధాకర్, శ్రీకర్, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కొనేటి అమర్‌నాథ్, ఎంపీడీవో నాగార్జునరావు, టీడీపీ కోడూరు పరిశీలకులు గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి మస్తాన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జనసేన కన్వీనర్లు పగడాల వెంకటేష్, జోగినేని మణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, టీడీపీ కోడూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సిద్దవటంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మూలపల్లె గ్రామంలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి శనివారం టీడీపీ నేతలు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజలకు చెప్పిన వాగ్దానాలు అన్నీ అమలుపరిచి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. మాది రైతు ప్రభుత్వమన్నారు. వైసీపీ పాలనలో రౌడీయిజం, అరాచకాలు పెట్రేగిపోయాయన్నారు. పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ నేత చెంచయ్యనాయుడు, బూత్ కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: వై.కోట పంచాయతీలోని రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్‌యోజన మొదటి విడత ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి హాజరయ్యారు.

ఆనందంలో మునిగి తేలుతున్న అన్నదాతలు

పెనగలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను తీసుకున్న రైతన్నలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.2 వేలతో కలిపి ఒకేసారి పొందిన రైతులు ఖరీఫ్ సాగుకు పనికొస్తుందంటున్నారు. మధ్యాహ్నం నుంచి ఐదు గంటల వరకు రైతుల ఖాతాలో రూ.2 వేల చొప్పున నిధులు జమ అవుతూ వచ్చాయి. కొన్ని బ్యాంకుల్లో ఐదు గంటల తర్వాత నెమ్మదిగా రూ.2 వేలతో ఐదు వేలు కలిపి రావడంతో హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నాటికి ప్రతిరైతుకు రూ.7 వేలు వస్తుందని సమాచారం.

రైతును రాజును చేయడమే లక్ష్యం : చమర్తి



అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజును చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి, పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట అబ్జర్వర్ చిట్టిబాబు తెలిపారు. శనివారం మండల పరిధిలోని తాళ్లపాక పంచాయతీలో అన్నదాన సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 27288 మంది రైతులకు రూ.20.11 కోట్ల చెక్కును ప్రదర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ ద్వారా యేడాదికి 20 వేలు చొప్పున శనివారం మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.5 వేలు కలిపి సూపర్‌సిక్స్ హామీ మేరకు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పీర్‌మున్నీ, టీడీపీ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్, టీడీపీ సీనియర్ నాయకులు శరత్‌కుమార్‌రాజు, పట్టణ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, గ్రామ అధ్యక్షుడు లక్ష్మీనరసయ్యరాజు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రైల్వేకోడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె పరిధిలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామికి శనివారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయిరాం ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పంద్రా నరసింహులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

గాలివీడు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండవ శనివారం భక్తులతో మండలంలోని దేవాలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణ వీధి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు రంనాయకులు, గండిమడుగు ఉమామహేశ్వరస్వామి ఆలయం, గేటు రామాలయంలో వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్ మూర్తులకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించగా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పెద్దూరు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

భూ కబ్జాకు పాల్పడితే చర్యలు: తహసీల్దార్

సిద్దవటం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా, ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే కఠినమైన చర్యలు తప్పవని తహసీల్దారు తిరుమలబాబు హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది ఇసుక డంపింగ్ చేసినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. భూకబ్జాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంజన్నకు ఘనంగా పూజలు

సిద్దవటం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని బాకరాపేట కనుమలోపల్లె కమ్మపాలెం గ్రామంలో వెలసిన అంజన్నకు ఘనంగా పూజలు నిర్వహించారు. అందులో భాగంగా సిద్దవటం - బద్వేల్ ప్రధాన రహదారి కమ్మపాలెం సమీపంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ రెండో శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పిచ్చయ్య మాట్లాడుతూ స్వామివారికి ఆకుపూజ, అభిషేకం, అర్చన, నాగవల్లి అర్చన వంటి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న రవీంద్రనాయక్

సుండుపల్లె, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎంఈవో రవీంద్రనాయక్ పేర్కొన్నారు. శనివారం రాయవరం, సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యతో పాటు సమాజంలో మంచీచెడులు తెలుసుకునేలా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

మాధవ్ పర్యటనను జయప్రదం చేయాలి



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రెడ్డిక్రిష్ణరాయల్

పెనగలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10న జిల్లా పర్యటనకు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని రైల్వేకోడూరు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్‌రాజు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం అత్తిగారిపల్లె శ్రీరామాలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డిక్రిష్ణరాయల్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతి కార్యకర్త పది మంది సభ్యులకు తక్కువ కాకుండా మాధవ్ పర్యటనలో పాల్గొనేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హార్టికల్చర్, మాజీ కన్వీనర్ తోట శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్సీ కార్యవర్గ సభ్యులు ఈటమాపురం సుబ్రమణ్యం, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు పి.రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.నరేష్, కార్యవర్గ సభ్యులు ఓబులవారిపల్లె మండల అధ్యక్షులు ముక్కా రూపేష్ రెడ్డి, పెనగలూరు మండల ప్రధాన కార్యదర్శి పి.మోహన్‌యాదవ్, ఉపాధ్యక్షులు చంద్రమోహన్ పెంచలసాయి, శ్రీనివాసులు, వెంకటరెడ్డి లక్ష్మీదేవి, హరిత, హరీష్, ఖాజామొహిద్దీన్, శివప్రసాద్‌రాయల్, వినుగోల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న చొప్పా యల్లారెడ్డి

రాజంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):అన్నమాచార్య పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ స్టడీస్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సీజీర్ జ్ఞానా మృతధార స్కీం ద్వారా శిక్షణ సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ డాక్టర్ డీజే సమతా నాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కోర్సు ద్వారా ఏఐ రంగంలోని ఆధునిక పరిజ్ఞానం, మెళవకుల గురించి నేర్చుకున్నామని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. భాగంగా రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్ అస్మాత్ ప్రథమ బహుమతిని, వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థిని షేక్ ఆశియ ద్వితీయ, ఎం.వెంకటసుధీర్ తృతీయ బహుమతులను అందుకున్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ ఎన్.మల్లికార్జునరావు, ఏఈటీ వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎంబీఏ డిపార్టుమెంట్ విభాగాధిపతి టి.నవనీత, ఎంసీఏ విభాగాధిపతి మదన్‌కుమార్‌రెడ్డి, ప్రోగ్రాం ట్రైనర్ బి.సుజిత్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శివకృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాద బాధితుడికి సుగవాసి ప్రసాద్‌బాబు పరామర్శ

రాయచోటిటౌన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గోవిందు నాగయ్యను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమంగా చేపల వేట నిర్వహిస్తే చర్యలు



మత్స్యకారులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

నందలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) :అన్నమయ్య జిల్లాలోని సోమశిల వెనుకజలాల్లో చేపల అక్రమ వేట నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని మత్స్యశాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం సోమశిల వెనుకజలాల్లో చేపల అక్రమ వేటపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల ఒకటి నుంచి మత్స్యశాఖ అధికారులు వేట చేయనివ్వకుండా నిషేధించినప్పటికీ కొందరు సాగిస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదులు అందడంతో స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తనిఖీల్లో భాగంగా ఈనెల 31 తేదీ వరకు చేపల వేట చేయరాదని, ఖాళీ చేసి వెళ్లిపోవాలని మత్స్యకారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి ప్రసాద్ నాయక్, కానిస్టేబుల్ చెన్నయ్య పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా శ్రీనివాసులు నాయుడు



రాయచోటిటౌన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రాయచోటి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మట్లి శ్రీనివాసులునాయుడు నియమితులయ్యారు. రాయచోటి నియోజకవర్గం పరిధిలోని సంబేపల్లె మండలానికి చెందిన శ్రీనివాసులునాయుడు తండ్రి గత 25 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగుతున్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. ప్రస్తు తం అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అంతేగాక నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేసిన సమయం లో సుమారు ఆయన వెంట పాదయాత్రలో నడిచారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో కూడా చంద్రబాబు విడుదల కోసం నిరసన తెలిపారు. వారి సేవలతో పాటు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆయన్ను రాయచోటి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ టీడీపీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

దళారీ వ్యవస్థను రద్దు చేయాలి

● కిలోకు రూ.16 గిట్టుబాటు ధర చెల్లించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

చిట్వేలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి మధ్య దళారీ వ్యవస్థను రద్దు చేసి కిలోకు రూ.16 చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చిట్వేలి ఎంఈవో కార్యాలయం సమీపంలోని భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంట ప్రారంభంలో టన్ను రూ.16, 17 వేలు పలికిన ధర క్రమేణా తగ్గుతూ టన్ను ధర రూ.7 వేలు చేశారన్నారు. కలెక్టర్ నిర్ణయించిన కిలో రూ.9 ధర పట్ల రైతులు సమ్మతించడంలేదన్నారు. కిలో రూ.16 చెల్లించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేయాలని, టన్నుకు 100 కిలోల తరుగు తీయడాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు. మార్క్ ఫండ్‌ను అమలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్ యార్డును ఏర్పాటు, హార్టికల్చర్ మార్కెట్ యార్డు అధికారులతో రైతులకు రూ.16 తగ్గకుండా ధర ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చదువు నేర్పిన బడి రుణం తీర్చుకుంటా

● పాఠశాల విద్యార్థుల వసతులకు దాత చేయూత



డాక్టర్ నాగమునెయ్య కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

సంబేపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దుద్యాల గ్రామం పెద్ద జంగంపల్లికి చెందిన వైద్యుడు డాక్టర్ నాగమునెయ్య తాను చదువుకున్న బడి రుణం తీర్చుకుంటానని తెలిపారు. శనివారం పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అడవికమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూజారివాండ్లపల్లె పాఠశాల విద్యార్థుల వసతుల కోసం సహకారం అందిస్తానని దాత ముందుకు రావడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అడవికమ్మపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి రమణయ్య తెలిపారు. పాఠశాల ఆవరణంలో వీరి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతంలో స్థిరపడి, అక్షర జ్ఞానాన్ని నేర్పిన బడి రుణం తీర్చుకునేందుకు వైద్యులు నాగమునెయ్య ముందుకు రావడం గర్వకారణయన్నారు. ఇలాంటి దాతలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో చదువుకున్న బడికి, సొంత ఊరికి సహకారం అందించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదివి ఉన్నత పదవులను అలంకరించాలని దాత తెలియజేశారు. అనంతరం ఆయనకు ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు దాత కుటుంబ సభ్యులను దుశ్శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదతరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగానికి ఎంపిక

రామాపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పోలీసు ఎంపికల్లో మండలంలోని గోపగుడిపల్లె కస్పాకు చెందిన కావలి అశ్విని పోలీసు ఉద్యోగానికి ఎన్నికైనట్లు ఆమె బంధువులు తెలిపారు. అలాగే సరస్వతిపల్లె పంచాయతీకి చెందిన మహదేవ్‌కు కూడా ఎంపికయ్యారు.

అంతర్జాతీయ బాక్సర్‌కు సన్మానం



జగదీష్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నందలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన నందలూరు వీఆర్వో మండ్ల జగదీష్‌ను తహసీల్దారు అమరేశ్వరి, సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె గ్రామానికి చెందిన జగదీష్ గతనెల 24వ తేదీ నుంచి 28 వరకు నేపాల్‌లో జరిగిన ఇన్విటేషన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో 72 నుంచి 75 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని విజయం సాధించి దేశ కీర్తి ప్రతిష్ఠతలను పెంపొందిస్తానని అన్నారు. తనను ప్రోత్సహిస్తున్న వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మోహన్, ఆర్ఐ సుశీల్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా వేరుశనగ సాగు

● పదును లేని వర్షం.. అదును కాని సాగు ● ఆశ చావక విత్తన సాగు

సంబేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా వర్షాధారం కింద సాగు చేసే పంట వేరుశనగ. జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 90 వేల నుంచి లక్ష హెక్టార్లపైన వేరుశనగ సాగు చేసే వారు. గత ఏడాది పరిశీలిస్తే ఖరీఫ్‌లో 40 వేల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైంది. ఏ ఏడుకాయేడు వేరుశనగ సాగు తగ్గుతూ వస్తోంది. సంబేపల్లె మండలంలో 2023లో 1280 హెక్టార్లు సాగు చేశారు. 2024లో 980 హెక్టార్లలో, ఈ ఏడాది 180 ఎకరాలు మాత్రమే సాగు చేపట్టగా ఆగస్టు 15 నాటికి సాగు గడువు ముగియనుంది. ఒకప్పుడు గ్రామాల్లో 80 నుంచి 90 శాతం వేరుశనగ పంట సాగు చేసే రైతులు ప్రస్తుతం 10 నుంచి 20 శాతం కూడా కనిపించడం లేదు. రైతులపై ప్రకృతి తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇలా అయితే వేరుశనగ సాగు ప్రశ్నార్థకమేనని పలువురు రైతులు పేర్కొంటున్నారు.


కొండ్రువాండ్లపల్లె వద్ద ఇటీవల కురిసిన వర్షానికి దుక్కి చేసిన పొలం


ఆశ వీడక విత్తన సాగు చేస్తున్న రైతులు


గాండ్లపల్లి వద్ద దుక్కి చేయని పొలం

అదునులోనూ లేని పదును

ఏరువాక అదును (ఖరీఫ్ సాగు) ఆరుద్ర, పెద్ద పుష్యమి, చిన్న పుష్యమి. ఈ మూడు కార్తెలు ఏరువాక వేరుశనగ సాగుకు అనువైన కార్తెలు, ఆరుద్ర, పెద్ద పుష్యమి కార్తెల్లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. చిన్నపుష్యమి కార్తెలో కూడా సాగు చేయవచ్చు కానీ ఆశించిన దిగుబడి రాదని చెబుతుంటారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15వరకు వేరుశనగ సాగు సమయం.. ఆ తర్వాత పంట సాగు చేయరు. జూన్‌లో పంట సాగు చేపట్టాలంటే మే నెలలో వర్షాలు కురవాలి. పంటలు దుక్కి చేసుకోవడానికి వర్షాలు పడితే తప్ప సాగు చేపట్టలేరు. ఈ ఏడాది రుతుపవనాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఎక్కడపడితే అక్కడ ఓ మోస్తారు వర్షాలు తప్ప సరైన పదును లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పొలాలు దున్నినా చాలాచోట్ల ఇప్పటికీ దున్నకాలు చేపట్టలేదు. మండల వ్యాప్తంగా పలుచోట్ల కొందరు రైతులు ధైర్యం చేసి వేరుశనగ సాగు చేస్తున్నారు.

రైతుల్లో కనిపించని ఉత్సాహం

శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లెలో సుమారు 85 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ వ్యవసాయ పొలం ఉంది. గతంలో ప్రతి రైతు తనకున్న పొలంలో వేరుశనగ పంట సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ ఊరిలో 10 కుటుంబాలు కూడా వేరుశనగ పంట సాగు చేయడం లేదు. ప్రకృతి విపత్తులు, వరుస నష్టాల వల్ల సాగుకు దూరమైపోయారు. ఏ రైతును పలకరించినా వేరుశనగ సాగు చేయాలంటే వర్షాలతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఒకప్పుడు వేరుశనగ విత్తన కాయల కోసం రిలీజ్ సినిమా టికెట్ల కోసం ఎగబడినట్లు విత్తన కౌంటర్ల వద్ద రైతులు బారులు తీరి విత్తనకాయల కోసం ఎగబడేవారు. అయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల గత ఐదారు సంవత్సరాలుగా పంట సాగు చేయడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగకాయలు అందిస్తోంది. సంబేపల్లె మండలానికి 1650 క్వింటాళ్లు మంజూరు చేశారు. అయితే విత్తనాల కోసం రైతులు మక్కువ చూపడం లేదు. అరకొర సాగు చేసిన రైతులు మార్కెట్‌లో లభించే విత్తన కాయలను కొనుగోలు చేస్తున్నారు. అతి తక్కువ మంది రైతులు మాత్రమే వేరుశనగ సబ్సిడీ కాయలను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అరకొర వర్షానికి ఆశ చావక కొంతమంది రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు.

ఒకప్పుడు ఊరంతా సాగు చేసేవాళ్లం..



మా ఊరిలో ఒకప్పుడు ఊరంతా వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేసేవారం. అప్పట్లో కలుపు తీసేందుకు కూలీలకు ఎక్కువ డిమాండ్ ఉండేది. ఇప్పుడు వర్షాలు కురవకపోవడంతో ఊరంతా కలిపినా 10 కుటుంబాలు కూడా వేరుశనగ సాగు చేయడం లేదు. ప్రకృతి ప్రభావం ఇలాగే ఉంటే రాను రాను వేరుశనగ సాగు కష్టమే. దేవుడి మీద భారం వేసి 3 ఎకరాలు వేరుశనగ సాగు చేశాను. 45 రోజులు గడిచింది. ఒకసారి గడ్డి కలుపు తీశాము. ఒక ఎకరాకు 20 నుంచి 25 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాము. పంట బాగా పండితే తప్ప లాభాలు రావడం లేదు.

- బొంగా కృష్ణారెడ్డి, రైతు, గాండ్లపల్లె

లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

● పోలీసులకు ఫిర్యాదు చేసిన వివాహిత

పీలేరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఓ వివాహిత శనివారం పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు... పీలేరు మండలంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వివాహితకు ఇద్దరు కుమార్తెలు. తన భర్త ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ క్రమంలో ముడుపులవేముల పంచాయతీ రాణావడ్డిపల్లెకు చెందిన యల్లమంద శ్రీనివాసులు తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త చనిపోక మునుపు సైతం తమ ఇంటికి వచ్చి లైంగికంగా వేధించేవాడని, తన భర్త చనిపోవడానికి ఇతనే కారణమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 1వ తేదీన శుక్రవారం రాత్రి సుమారు 7గంటల ప్రాంతంలో తన ఇంటికి వచ్చి పనుల విషయమై మాట్లాడాలని పిలిచి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని, గట్టిగా అరవడంతో అత్తమామ అనసూయ, రమణయ్య, మరికొందరు అతని బారి నుంచి కాపాడారని తెలిపారు. ఈ విషయమై రాణావడ్డిపల్లె ఆలయం వద్ద జరిగిన పెద్దమనుషుల పంచాయితీలోనూ తనతో దురుసుగా ప్రవర్తించడంతో అతనికి దేహశుద్ధి చేశారని తెలిపారు. తనను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న శ్రీనివాసులు నుంచి రక్షణ కల్పించాలని కోరగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

సుండుపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన గోవిందు రామయ్య (39) శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శుక్రవారం రాయచోటి నుండి స్వగ్రామం రాయవరం గ్రామ పంచాయతీ కావలిపల్లికి వెళ్తుండగా సుండుపల్లి రాయచోటి ప్రధాన రహదారి రాచంవాండ్లపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనం నుండి కిందపడి గాయాలపాలయ్యాడు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత...

బి.కొత్తకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొటుకు పంచాయతీ పులుసుమానిపెంటలో భర్తపై కోపంతో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పులుసుమానిపెంటలో నివాసం వుంటున్న శివశంకర్, లక్ష్మీదేవి(42) దంపతులకు జగదీష్, రజిత సంతానం. మద్యానికి బానిసైన శివశంకర్‌తో తరచూ గొడవ పడే లక్ష్మీదేవి శుక్రవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వున్న విషద్రావణాన్ని తాగింది. గమనించిన స్థానికులు సమీపంలో వున్న కర్నాటక గ్రామం రాయల్పాడుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మదనపల్లెకు, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. రుయాలో చికిత్స పొందుతూ లక్ష్మీదేవి శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి


వెంకటరత్నం మృతదేహం

కలకడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీ లక్ష్మీపురం సమీపంలో శనివారం రాత్రి అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇరువురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. దేవళపల్లికి చెందిన డ్రైవర్ నాగరాజనాయుడు, కూలీలు అదే గ్రామం దిగువ దళితవాడ వాసి వెంకటరత్నం (36), గుర్రంకొండ మండలం మార్రిమాకులపల్లికు నరసింహులు (52) ట్రాక్టర్‌లో ఓ రైతుకు టామోట కట్టెలను తోలుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో లక్ష్మీపురం సమీపంలోకి రాగానే అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాలీలో కట్టెలపై కూర్చొని వున్న వెంకటరత్నంపై లోడ పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయలపాలైన డ్రైవర్ నాగరాజనాయుడు, నరసింహులును చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన మునస్వామి శెట్టి

రామసముద్రం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక సరిహద్దులోని పెగలపల్లికి చెందిన మునస్వామిశెట్టి(62) మండలంలోని గెవి తిమ్మరాయస్వామి ఆలయానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రామసముద్రం-పుంగనూరు రోడ్డు మార్గంలో గాంధీనగర్ వద్ద ఉన్న గుంతను తప్పించబోయి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన గుంతకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యాటకుల రక్షణకే ప్రాధాన్యం

● హార్సిలీహిల్స్‌పై డీఎస్పీ ముమ్మర తనిఖీలు ● శాంతిభద్రతలపై కీలక ఆదేశాలు


గాలిబండపై పరిశీలిస్తున్న పోలీసు బృందం


రిసెప్షన్‌లో విచారిస్తున్న డీఎస్పీ మహేంద్ర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బి.కొత్తకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్ పరిధిలో పర్యాటకుల రక్షణకే ప్రాధాన్యత ఉంటుందని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై డీఎస్పీ మహేంద్ర 50మంది పోలీసు సిబ్బందితో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పోలీస్ భవనానికే దిక్కులేదు.. పర్యాటకుల రక్షణ ఎలా?' అనే శీర్షికన వెలువడిన వార్తాకథనానికి ఆయన స్పందించారు. ఇద్దరు సీఐలు, 5మంది ఎస్‌ఐలతో సహా 50మంది సిబ్బందితో హార్సిలీహిల్స్ మొత్తాన్ని జల్లెడ పట్టారు. ఏపీ టూరిజం రిసార్ట్స్, హోటళ్లు, ప్రైవేటు లాడ్జీ లను పరిశీలించి రూములు అద్దెకు ఇచ్చే సమయంలో పర్యాటకుల నుంచి తగిన ఆధారాలు తీసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వరాదని హెచ్చరించారు. వ్యూపాయింట్ వద్ద జాగ్రత్తగా వుండాలని, ద్విచక్రవాహనాలలో కొండపైకి వచ్చేవారు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలీసు హెల్ప్‌డెస్క్ భవనం దుర్వినియోగం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత కారణంగా హెల్ప్‌డెస్క్‌లో పోలీసులను రెగ్యులర్‌గా పెట్టలేకపోయామని, ఇకపై అందుబాటులో వుండేలా చూస్తామన్నారు. ప్రైవేటు రెస్టారెంట్ల యాజమాన్యం నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట స్థానిక సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు, సిబ్బంది వున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

వాల్మీకిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని వాల్మీకిపురం మండల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ అన్నారు. శనివారం నమాజ్ కట్టవీధి ఉర్దూ పాఠశాలలో పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1000మంది బాలురకు 926 మంది బాలికలు ఉన్నారన్నారు. ఆడపిల్ల అయినా మగ బిడ్డ అయినా సమానంగా చూడాలన్నారు. గర్భిణీ సమయంలో స్కానింగ్ కేవలం పిండం ఆరోగ్య పరిస్థితి కోసమేనని, ఈ విషయాన్ని తల్లులు గమనించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమృత, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ

దొడ్డిపల్లె వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లెలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ (డీపీహెచ్ఎన్ఓ) శోభాలత, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మునీశ్వర్ వెల్‌నెస్ సెంటర్‌లోని గర్భిణుల నమోదు, హిమోగ్లోబిన్, కాన్పులు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ తదితర రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శివరామాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి పోషక విలువలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేగళ్లు వైద్యాధికారి రాధామాధవి, హెచ్ఈ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండమ్మకు కుంకుమార్చన

సుండుపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బోయకొండమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మొదటి రోజు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నుండి మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారంతో ముగుస్తాయన్నారు. అందులో భాగంగా శనివారం గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

పులివెందుల జడ్పీటీసీని గెలుస్తాం

● ఐకమత్యంతో ముందుకు సాగుతాం : ఎమ్మెల్యే ఆది ● కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత : బీటెక్ రవి


విలేకరులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. శనివారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని ఆరు పంచాయతీల నాయకులతో పంచాయతీల వారీగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి కనీసం పులివెందులను కూడా అభివృద్ధి చేయలేని స్థితిలో పాలన సాగించారన్నారు. ప్రజలకు అవసరమైన పనులు కూడా చేయలేకపోయారన్నారు. ఈరోజు ఆయా పంచాయతీల నాయకులతో మాట్లాడుతుంటే అనేక సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. 600 రోజుల క్రితం నేను పులివెందులకు వచ్చానన్నారు. అప్పటికి ఇప్పటికి ఎంతో మార్పు వచ్చిందన్నారు. వైఎస్ జగన్, అవినాష్‌రెడ్డి చేసిన తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసు తమపై పెట్టేందుకు ప్రయత్నించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వైసీపీ చేస్తున్న తప్పులను వివరిస్తామన్నారు. పోలీసులకు, మాకే పోటీ అని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అంటున్నారని, టీడీపీ, కాంగ్రెస్, స్వతంత్రులు తదితరులు నామినేషన్ దాఖలు చేసి పోటీలో ఉన్నారని, దీంతో ఆయన చెప్పినట్లు ఇక్కడ సాగదన్నారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. ఈరోజు పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పార్టీలోకి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఒక కుటుంబాన్నే ఆదరిస్తున్నారన్నారు. రైతులు సాగుచేసే సమయంలో పంట మార్పిడి చేసే విధంగా ఇక్కడ కూడా ఈ పద్ధతి తేవాలన్నారు. అనంతరం పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 2006 వరకు నేను టీడీపీలోనే ఉండేవాడినని, అప్పుడు సతీష్‌రెడ్డి వ్యవహారశైలి నచ్చక కాంగ్రెస్‌లో చేరానన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎల్‌సీ ఛైర్మన్ జోగిరెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, పుష్పనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను సద్వినియోగం చేసుకోండి : సబ్ కలెక్టర్


రైతులకు అన్నదాత సుఖీభవ పథకం చెక్కు అందిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకం కింద రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని రైతులకు మొదటి విడతగా 20,162 మంది రైతులకు రూ.14.11కోట్లు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు గురుమూర్తి గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు వేసి మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ మొదటి విడతగా రూ.7వేలు, రెండో విడత రూ.7వేలు, మూడో విడత రూ.6వేలు మొత్తం కలిపి రూ.20వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్, టీడీపీ నేతలు విద్యాసాగర్, మధుబాబు, సిమెంట్ రమణ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఓబులవారిపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబులవరిపల్లెలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన మిగిలి ఉన్న కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.దేవరాజ్ తెలిపారు. పదో తరగతి పాసైన వారు, పాలీసెట్ 2025లో రాసినవారు, రాయని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో ఈనెల 5న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌లో సీటు పొందిన అభ్యర్థులు అదేరోజు కాలేజీలో వివిధ ఫీజుల కింద రూ.5800 నగదు, ఒరిజనల్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీట్లు పొందినవారికి ఎటువంటి స్కాలర్‌షిప్ రావని ప్రిన్సిపాల్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మోర్‌సింగ్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డులో ప్రమాదవశాత్తు లారీ ఢీకొని మృతి చెందిన కూలీ కుటుంబానికి టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రూ.2లక్షల ఆర్థికసాయం అందించింది. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో నగదును అందించారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ మాట్లాడుతూ మార్కెట్‌లో లారీ వెనక్కి వస్తుండగా కూలీగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోర్‌సింగ్ లారీ ఢీకొని గత నెలలో మృతి చెందాడన్నారు. అప్పట్లోనే హమాలి వర్కర్స్ స్పందించి మోర్‌సింగ్ భౌతికకాయాన్ని ఉత్తరప్రదేశ్‌కు పంపారన్నారు. టీఎన్‌టీయూసీ ముందుకొచ్చి హమాలీ యూనియన్, మండీ వర్కర్స్, వ్యాపారులు, లారీ వర్కర్స్ యూనియన్ కలసి రూ.2లక్షల నగదు సేకరించామని, ఈ మొత్తాన్ని మోర్‌సింగ్ కుటుంబీకులకు అందించామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రామయ్య, ఉపాధ్యక్షుడు రసూల్, కార్యదర్శి మహబూబ్‌బాషా, మురాషా, షామీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్ప ఇతరులకు పాఠశాలల్లో ప్రవేశం లేదంటూ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించేలా విద్యాశాఖ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు విద్యాసంస్థల్లో జరిగే అన్యాయాలను బహిర్గతం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే విద్యార్థి సంఘాలకు ఇలాంటి ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఆ ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి ఆహ్వానం

వాల్మీకిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొత్త ఇందిరమ్మ కాలనీలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీహెచ్ చంద్రకళ పేర్కొన్నారు. ఎస్సీ విభాగానికి మిగులు సీట్లు ఖాళీ ఉన్నాయని విద్యార్థులు సద్వియోగం చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 25ఖాళీలు, 7వ తరగతిలో 3ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత గల విద్యార్థులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుల సమాచారంతో నేరుగా పాఠశాలలో సంప్రదించాలన్నారు.

లారీ, ఆటో ఢీ : ఒకరి మృతి

● ఐదుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ఆటో

రాజంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం బోయనపల్లె సమీపంలో శనివారం లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో రాజంపేట పట్టణం రామ్‌నగర్‌లో నివాసం ఉండే నాగారం లక్ష్మీదేవి(46) మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వివరాల్లోకి వెళితే... నందలూరులో సౌమ్యనాథస్వామిని దర్శించుకుని రాజంపేటకు వస్తున్న ఆటోను తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రామ్‌నగర్‌కు చెందిన నాగారం దివ్య, ఓబులవారిపల్లెకు చెందిన తోట గగన్, మౌనిక, వెంకటరమణ, శేషమాంబపురానికి చెందిన సాంబయ్యకు తీవ్ర గాయలయ్యాయి. ఈ మార్గంలో వెళుతున్న ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే ప్రమాద సంఘటనను గమనించి వెంటనే గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

వైవీయూలో ఇన్‌చార్జ్‌ల పాలనకు త్వరలో విముక్తి

- కొత్త వీసీ నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు
- సెర్చ్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు

యోగివేమన యూనివర్సిటీ



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇన్‌చార్జిల పాలనకు త్వరలో విముక్తి కలగనుంది. వైస్ చాన్సలర్ నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సెర్చ్ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో యోగివేమన యూనివర్సిటీలో గత సంవత్సరం కాలం నుంచి ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌లను నియమించింది. 2024 జూలై 19న ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. సుమారు 7 నెలలపాటు ఇన్‌చార్జి పాలన కొనసాగింది. విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రెగ్యులర్ వీసీగా సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ప్రణితి ప్రకాష్‌బాబును నియమించింది. అయితే ఆయనను పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వీసీగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రకాష్‌బాబును రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు విక్రమ్‌సింహపురి యూనివర్సిటీ వీసీగా పనిచేస్తున్న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును వైవీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా నియమిస్తూ గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మార్చి 16వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి మళ్లీ ఇన్‌చార్జిపాలనలో యోగివేమన యూనివర్సిటీ కొనసాగుతోంది.

ప్రస్తుతం సెర్చ్ కమిటీని ప్రభుత్వం నియమించడంతో వైవీయూ రెగ్యులర్ వీసీ మరో పది రోజుల్లో వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

సెర్చ్ కమిటీ నియామకం

వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీ సూచనలు ఇస్తుంది. ఈ నేపథ్యంలో ఈనెల 30వ తేదీ సెర్చ్ కమిటీ సభ్యులను నియమిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు విడుదల చేశారు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీ తరపున సర్దార్‌పటేల్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేవదత్‌శర్మ నియ మితులయ్యారు. ప్రభుత్వం తరపున ఆదికవి నన్నయ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ పి.జార్జ్ విక్టర్‌ను, వర్సిటీ పాలకమండలి తరపున రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ కేవీ ప్రసాద్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ఆచార్యుల అనుభవం, నైపుణ్యాలు, పరిశోధనలు, ప్రచురణలు తదితర అంశాలను పరిశీలించి ఉన్నత విద్యామండలికి సూచనలు ఇస్తారు. అనంతరం గవర్నర్ ఉపకులపతులను నియమిస్తారు. ఈ నియామకాలు మరో వారంలోగా పూర్తిచేసే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు, ఆచార్యులు భావిస్తున్నారు.

ముమ్మర ప్రయత్నాలు

వీసీ పదవుల కోసం వైవీయూలో పలువురు ప్రొఫెసర్లు దరఖాస్తు చేశారు. ఇందులో కొందరు రిటైర్డ్ ప్రొఫెసర్లు కూడా ఉన్నట్లు సమాచారం. వైస్ చాన్సలర్ పదవి దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు పదుల సంఖ్యలో ఆశావహులు ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మరో పది రోజుల్లో రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియమితులయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం తెలియజేస్తున్నారు.

నిరాధార ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చవద్దు

యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిరాధార ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చవద్దని యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం అధ్యక్షుడు ఆచార్య ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎం.వినోదిని సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా నిందలు మోపడం తగదన్నారు. విశ్వవిద్యాలయంలో కాన్వకే షన్ నిర్వహించడానికి రెండేళ్ల క్రితం ప్రొఫెసర్ చింతా సుధాకర్ ఉప కులప తిగా ఉన్న సమయంలో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. సుమారు 13000 మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాల కోసం ఈ పట్టాల అవసరం ఉందని విద్యార్థులు పదేపదే అధికారులకు విన్నవిస్తున్న నేపథ్యంలో కాన్వకేషన్ వెంటనే జరపాలని విశ్వ విద్యాలయం నిర్ణయించిందన్నారు. అందుకు అనుగుణంగానే విశ్వవిద్యాలయం పనులు ప్రారంభించిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యా లయ కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున కాన్వకేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయం తీసుకు న్నారని తెలిపారు. కాన్వకేషన్ నిర్వహణకు అవసరమైన జర్మన్ షెడ్లు వేయ డానికి, గోల్డ్ మెడల్స్ తయారు చేయించడానికి ఇ-టెండర్ల ద్వారా కొటేషన్స్ కోరడానికి నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు. వీటిలో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పాత్ర ఏమాత్రం లేదని, స్వలాభం కోసం పక్షపాత దృష్టితో కొంతమంది పనిగట్టుకొని విశ్వవిద్యాలయ అధికారుల మీద బురదజల్లాలని ప్రయత్నించినట్లు తెలుస్తోందన్నారు.

వైవీయూ డిప్లమో కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు యూనివర్శిటీ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ తెలిపారు. జర్నలిజంశాఖ ఆధ్వర్యంలో పీజీ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఏదేనీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని సూచించారు. సాయంకాలం తరగ తులు కావడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతర వృత్తుల్లో ఉన్న వారు, పీజీస్థాయి కోర్సులు చదువుతున్న వారు కూడా ఇందులో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఆర్‌ఎస్‌కేలో రూ.4.70 లక్షలు స్వాహా

- పోలీసు ఫిర్యాదుకు అధికారుల సన్నద్ధం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివశంకర్ సుమారు రూ.4.70 లక్షలు స్వాహా చేశారు. గత రబీ సీజన్ చివరి దశలో కల్లూరు రైతు సేవా కేంద్రానికి సరఫరా అయిన ఎరువులు, విత్తనాలను రైతులకు అందించి ఆ మొత్తాలను వసూలు చేశారు. ఈ సొత్తును ప్రభుత్వానికి చెల్లించకుండా సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు. స్వాహా చేసిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా ఇటు విధులకు హాజరుకాకుండా జనవరి నెల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అప్పట్లో ఈ విషయంపై స్థానిక వ్యవసాయ అధికారులకు తెలిసి పలుమార్లు హెచ్చరించినా అదిగో కడుతాను. ఇదిగో కడుతాను అంటూ విధులకు హాజరవ్వడం మానుకున్నాడు. ఈ విషయమై ప్రస్తుత వ్యవసాయశాఖ అధికారి వరహరి కుమార్‌ను వివరణ కోరగా.. తాను ఇక్కడకు రాకముందే చోటు చేసుకున్న నగదు స్వాహా విషయమై జిల్లా ఉన్నతాధికారులు గుర్తించారన్నారు. వీఏఏ శివశంకర్ గురించి వాకబు చేయగా జనవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని చెప్పారు. విత్తనాలు, ఎరువుల డబ్బులను సుమారు రూ.4.70 లక్షలను స్వాహా చేయగా.. అతను అందుబాటులో లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులను సొంత ప్రయోజనాలకు వాడుకున్న వైనంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏవో వివరించారు.

నల్సాపథకంపై శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప న్యాయసేవ సదన్‌లో శనివారం నల్సాపథకం-2025పై జిల్లా ప్రధాన జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని అధ్యక్షతన జిల్లా జాగృతి యూనిట్ సభ్యులకు శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సహాయం పొందడంలో సవాళ్లు, న్యాయ సహాయం కోసం చట్టపరమైన అవగాహన, ప్రాముఖ్యత, ప్రస్తుత చట్టపరమైన నిబంధనలు, స్థానిక సంస్థల ద్వారా న్యాయసహాయం అవగాహనను సంస్థాగతీకరించడానికి ఒక పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పథకం లక్ష్యాలు, జిల్లా తాలూకా యూనిట్ల స్థాపన, చట్టపరమైన అవగాహన వ్యాప్తి విధానం, న్యాయసేవల ప్రదాతలు, సంస్థల బాధ్యతలు, నివేదిక, పర్యవేక్షణ, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు గరికపాటి దీన బాబు, ఎస్.శాంతి, జి.రమేష్‌కుమార్, ఎస్.బాబాఫక్రుద్దీన్, రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కడప డీఎస్పీఏ వెంకటేశ్వర్లు, కడప అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కె.రాకేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెల్-2 ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పీజీటీలకు ఆదివారం నుంచి ఐదురోజుల పాటు స్పెల్-2 ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజులు పేర్కొన్నారు. శనివారం కడప నగరం సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగర పరిధిలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో కేజీబీవీ పీజీటీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ) సబ్జెక్టు టీచర్లకు స్పెల్-2 ఇన్ సర్వీస్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 119 మంది ఫిజిక్స్ పీజీటీలు, 119 మంది కెమిస్ట్రీ పీజీటీలు, 21 మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు చెప్పారు. సూపరింటెండెంట్ ప్రేమకుమారి, జీసీడీఓ రూత్‌ఆరోగ్యమేరి, ఏఎంఓ వీరేంద్రయాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్లు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎల క్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు పాలిసెట్ పరీక్షల్లో ర్యాంకు రాకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీటుకోసం వచ్చే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకు రావాలని, ఫీజు కేవలం ఏడాదికి రూ.6వేలు అని తెలిపారు. వివరాలకు 9010222172, 9490378886 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీలో పీజీ కళాశాలలోని ఎంబీఏ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం ఈనెల 5వ తేదీ ఉదయం 11గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్ అలైడ్ బ్రాంచెస్), ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) అర్హతల కలిగి ఉండాలన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పేపర్లను, అనుబంధ అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ప్రోగ్రామింగ్ ఇన్ ఆర్, మిషన్ లెర్నింగ్, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటావేర్ హౌసింగ్ అండ్ మైనింగ్, బిజినెస్ అనలిటిక్స్, పవర్ బీఐ, డీబీఎంఎస్, డేటా విజువలైజేషన్‌లలో బోధించేవారు కావాలన్నారు. అర్హత ఉన్న ఆసక్తిగల అభ్య ర్థులు బయోడేటా, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సీకేదిన్నె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో జమాల్‌పల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... లక్కిరెడ్డిపల్లె నుంచి కడపకు మామిడి పండ్ల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొంది. దీంతో పఠాన్ మౌలాలి, నూర్ బీ అనే ఇరువురు తీవ్రగాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి హైడ్రాలిక్ కట్టర్‌తో క్యాబిన్ తొలగించి బయటికి తీసి చికిత్స నిమిత్తం 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



దువ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆకుల నాగజ్యోతి(27) శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. ఈమేరకు ఆమె భర్త హరి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాలనీ సమీపంలో ఉన్న కేసీ కాలువ వద్ద ఆమె ధరించిన చున్నీ కనిపించడంతో ఆత్మహత్యకు ఏమైనా పాల్పడిందా అనే కోణంలో విచారిస్తున్నట్లు ఏఎస్ఐ భూషణం తెలిపారు. ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు భర్త పోలీసులకు తెలిపారు.

జోనల్ త్రో బాల్‌లో సత్తా చాటిన హెచ్‌పీఎస్

కడప స్పోర్ట్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కడప నగర రిమ్స్ సమీప హైద రాబాదు పబ్లిక్ స్కూలులో శనివారం జరిగిన ఏపీ, తెలంగాణ ఆరు జోన్లకు చెందిన జోనల్ త్రో బాల్ టోర్నమెంటులో హైదరాబాదు పబ్లిక్ స్కూలు విద్యార్థులు సత్తాచాటారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి హాజరై తొలుతక్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

అనంతరం జరిగిన అండర్ 17 బాలికల విభాగంలో జాన్‌బీ హైదరా బాదు పబ్లిక్ స్కూలు (కడప జట్టు) మొదటి స్థానం సాధించి స్వర్ణపతక విజేతగా నిలిచింది. అలాగే అండర్ 14 బాలికల విభాగంలో జోన్ బీ హైదరాబాదు పబ్లిక్ స్కూలు కడప జట్టు కాంస్య పతకం అందుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమిత్‌సింగ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయిర్ నుంచి కృష్ణా జలాలు వస్తుండటంతో గండికోట ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. శనివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 9,000 క్యూసె క్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీ ఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 300 క్యూసెక్కులు, జీఎన్ ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులు తు న్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తు తం 10.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజె క్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

ట్రిపుల్‌ఐటీ మెస్‌లు అక్షయపాత్రకు అప్పగింత

- 24వేల మంది విద్యార్థులకు భోజనం సరఫరా
- ఇడుపులపాయలో పరిశీలించిన అక్షయపాత్ర ప్రతినిధులు



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని మెస్-2 వద్ద విద్యార్థినులు

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చదువుతున్న 24వేల మంది విద్యార్థులకు ఇక నుంచి అక్షయపాత్ర సంస్థ ద్వారా భోజనం అందించనున్నారు. ప్రభుత్వ సూచన మేరకు ఆర్జీయూకేటీ అధికారులు అక్షయపాత్రకు ఎల్ఓసీ ఇచ్చారు. ఇడుపులపాయలో 4, నూజివీడులో 4, శ్రీకాకుళంలో 2, ఒంగోలులో 2 మెస్‌లను త్వరలో అక్షయపాత్ర ద్వారా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు వివిధ కంపెనీల ద్వారా నిర్వహించేవారు. పలు సందర్భాల్లో విద్యార్థులు భోజనం నాణ్యంగా ఉండడం లేదని ఫిర్యాదులు, ఆందోళనలు చేశారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మెస్‌లను అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగంచాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి విన్నఇంచిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలు అక్షయపాత్రకు అప్పగించాలని సూచించారు. ఈ మేరకు 12 మెస్‌లను నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. 15 రోజుల్లోగా ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లను అక్షయపాత్ర స్వాధీనం చేసుకొని భోజనం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లను అక్షయపాత్ర ప్రతినిధులు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు భోజనం అందించేందుకు ఎలాంటి సౌకర్యాలు,వసతులు ఉండాలన్న విషయాలపై పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ట్రిపుల్‌ఐటీ అధికారు లతో చర్చించారు. అక్షయపాత్ర ద్వారా శాఖా హారభోజనం మాత్రం అందిస్తుండగా మాంసా హార భోజనాన్ని అందించేందుకు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులను భాగస్వామ్యం చేయడమా లేక కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలనే విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ట్రిపుల్‌ఐటీ అధికారి ఒకరు తెలిపారు.

అన్నంలో పురుగులొస్తున్నాయి..

- ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల నిరసన

వేంపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నం సక్రమంగా ఉండడం లేదు...ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు.. ఒక్కోసారి పురుగులు వస్తున్నాయి... ఎలా తినాలంటూ ట్రిపుల్‌ఐటీలో పీయూసీ చదువుతున్న విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పాత క్యాంపస్‌లో జైస్వాల్ కంపెనీ ఆధ్వర్యంలో మెస్ నిర్వహిస్తున్నారు. ఓల్డ్ క్యాంపస్‌లో ఉన్న పీయూసీ బాలికలకు, కొత్త క్యాంపస్‌లో ఉన్న పీయూసీ బాలురకు భోజనం సరఫరా చేస్తారు. కొత్త క్యాంపస్‌లో ఉన్న పీయూసీ విద్యార్థులు శనివారం రాత్రి హాస్టల్ గదుల నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించి నాణ్య మైన ఆహారం అందించాలని కోరారు. ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులు అక్కడకు చేరుకొని సరైన భోజనం అందేలా చూస్తామని సర్ది చెప్పడంతో నిరసన విరమించినట్లు ఏఓ పెనుగొండ రవికుమార్ తెలిపారు.

వైభవంగా యోగనేలమల్లేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ

నిమ్మనపల్లి ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాంతంలో వెలసిన యోగనేలమల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహా గణపతి పూజతో వైభవంగా పునః ప్రతిష్ఠను ప్రారంభించినట్లు ఆలయ ఈఓ మంజుల, చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం శిఖర కలశ స్థాపన, జీవ ధ్వజ స్థంభ ప్రతిష్ఠను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, గుత్తా హరికృష, రాజన్న తదితరులు పాల్గొన్నారు. మదనపల్లి వాసి గుత్తా హరికృష్ణ దంపతులచే అన్నదానం నిర్వహించారు.

బీజేపీతోనే రహదారులకు మహర్దశ

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశంలోని జాతీయ రహదారులకు మహర్దశ వచ్చిందని బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ బి.చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. రూ.1852 కోట్లతో నిర్మించిన పీలేరు-మదనపల్లె రహదారిని విజయవాడలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేయడంతో బీజేపీ నేతలు శనివారం సాయంత్రం పీలేరులో సంబరాలు చేసుకున్నారు. అందుబాటులోకి వచ్చిన పీలేరు-మదనపల్లె రహదారితో ప్రయాణీకులకు సమయం ఆదా అవుతుందన్నారు. పీలేరు-తిరుపతి రహదారి పనులు కూడా త్వరలోనే పూర్తి అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటరమణ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుధారాణి, కిసాన్ మోర్చా కార్యవర్గసభ్యుడు నాగేంద్ర నాయుడు, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీవీ రెడ్డి, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం ముఖ్యం

కలకడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మస్థైర్యం కలిగి వుండడం చాలా ముఖ్యమని రిడో సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వ రయ్య అన్నారు. బాటవారిపల్లి హైస్కూల్‌లో అభయ-భవిత కార్యక్రమంలో 'పది సూత్రాలు' పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలకు ఉపయోగపడేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అయన తెలిపారు.

రైతే రాజు బాబు ఆకాంక్ష

అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ నిధులు ● సంక్షేమ మాసం ఆగస్టు

కౌలు రైతులకూ అవకాశం ● రైతుల పాలిట ఆపద్బాంధవుడు : ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి




కలికిరి సభలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి - తంబళ్లపల్లెలో రైతులకు చెక్కును అందిస్తున్న జయచంద్రారెడ్డి, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలికిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతును రాజుగా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేష కృషి సలుపుతున్నారని, ఆగస్టు మాసమంటే సంతోషకరమని, సంక్షేమ మాసమని రైతులు ఆనందాన్ని పంచుకుంటున్నారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి వివరించారు. స్థానిక కేవీకేలో 'అన్నదాత సుఖీభవ' పీఎం కిసాన్ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నెల ప్రారంభంలోనే రైతులందరికీ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమవడం, కుటుంబ పెద్దను కోల్పోయి ఇబ్బందులు పడుతున్న కుటుం బాలకు ఆసరాగా మృతుల భార్యకు వితంతు పెన్షన్లు ఇవ్వడం, 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని మహిళలందరూ ఉచితంగా బస్సు ప్రయాణం చేయబోతున్నారని, కొత్త రేషన్ కార్డులు అందివ్వడం, ఏక బిగిన ఒకే నెలలో ప్రజలకు అందించడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. ఖాతాలకు జమకాని రైతులందరూ వివరాలు అందజేస్తే, కౌలు రైతులతోపాటు అక్టో బరులో జమవుతాయన్నారు. తంబళ్ళపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో తాగునీటికి శాశ్వత పరిష్కారంగా గండికోట నుంచి నీటిని తరలిస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యేక అధికారి సత్యనారాయణ, సింగిల్ విండో అధ్యక్షులు, మండల టీడీపీ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి చెరువుకూ హంద్రీనీవా జలాలు

తంబళ్లపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి చెరువుకూ హంద్రీనీవా జలాలనందించి సస్యశ్యామలం చేస్తామని, రైతును రాజుగా చూసే లక్ష్యంగా ప్రభుత్వం నడుస్తోందని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం గుండ్లపల్లె రైతు సేవా కేంద్రం వద్ద జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, పరిశీలకుడు దినేష్‌రెడ్డి, కూటమి నేతలతో కలిసి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించి చెక్కును రైతులకు అందచేశారు. నియోజకవర్గంలో 44867 మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ' కింద రూ.22.43 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ.8.97 కోట్లు లబ్ధిచేకూరు తోందన్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, గ్రామాధ్యక్షుడు రెడ్డప్పనాయుడు, యూనిట్ ఇన్‌చార్జి కాలా నారాయణ, తెలుగు యువత పార్లమెంటు కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తుల సీధర్ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మండలానికి రూ.4 కోట్ల 39 లక్షలు

పెద్దమండ్యం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వున్న 6274 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 4కోట్లు 39 లక్షలు విడుదల చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఓ కృష్ణ, ఎంపీడీఓ శ్రీధర్ రావు వెల్లడించారు. బండమీదపల్లి రైతుసేవా కేంద్రంలో జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు నాగూరి విశ్వనాధరెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్ర బాబు ప్రసంగం టీవీలో చూసే ఏర్పాటు చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగూరి విశ్వనాధరెడ్డి, నేతలు ఇస్మాయిల్ (చింటూ) కాలేషా, రామాంజులు నాయుడు, గంగాధర, ఆనంద, రామాంజులు, సాంబ, రైతులు, అధికారులు, పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బుక్కే మనోహర్ నాయక్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

రైతుల పాలిట ఆపద్బాంధవుడు

నిమ్మనపల్లి ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్నదాతకు డబుల్ సంక్షేమాన్ని ఇచ్చిన ఆప ద్బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మునిరత్నం పేర్కొన్నారు. నేతలు సుధాకర్ రావు విజయ్, చంద్ర, సూర్యప్ర కాష్, ఆర్వే వెంకటేష్, శ్రీనివాసులు, మురళి, చినబాబు, జయన్న, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ 'అన్నదాత సుఖీభవ'

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ లబ్ధి చేకూరాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయాధికారి ప్రేమలత వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అర్హులైన 10,136 మంది రైతులకు 70.95కోట్లు నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రారంభించే అన్నదాత సుఖీభవ, నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించేలా ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, మాజీ ఎంపీటీసీ సూరి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

మలకలచెరువు ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని వక్తలు అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమచేసిందన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ చిత్రపటాలకు సచివాలయ ఉద్యోగులు, మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ శారద, ముని కృష్ణ పాలాభిషేకం చేశారు. టీడీపీ కమిటీ అధ్యక్షుడు కే.వి. రమణ, మాజీ ఎంపీటీసీ బయ్యారెడ్డి, తుమ్మల చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పి.వి. వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు ముర్రుపాలే తొలి టీకా

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జన్మించిన గంటలోపు పట్టే ముర్రుపాలు నవజాత శిశువులకు తొలి టీకా వంటివని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి గిరీషా పేర్కొన్నారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైద్య సిబ్బందిపై తల్లిపాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, సూపర్‌వైజర్ ఉమ, ఏఎన్ఎం ఫాముస్నిసా, టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలే పిల్లలకు శ్రేయస్కరం

గుర్రంకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చంటిపిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరమని డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. మర్రిపాడులో శనివారం తల్లిపాలు వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ భారతి, డిప్యూటీ హెల్త్ ఎడుకేటర్ రఫీ, ప్రజలు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి అన్నారు. కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ పింఛన్ పొందుతూ మరణించిన వారి సతీమణికి ప్రభుత్వం స్వచ్ఛందంగా అందిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ర్యాగింగ్ చట్ట విరుద్ధం : డీఎస్పీ

మదనపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ర్యాగింగ్ చట్ట విరుద్ధమని డీఎస్పీ మహేంద్ర సూచించారు. స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై డీఎస్పీ అవగాహన కల్పి స్తూ ర్యాగింగ్ చేయడం నేరమని, ర్యాగింగ్ చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని తాలూకా సీఐ కళా వెంకటరమణ అన్నారు. కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ రాయుడు, డీన్ భాస్కర్, ఎం.రోషిణి, అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఆకర్షణలకు గురి కాకండి

పీలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారాలు, మత్తు పదార్థాలు, సినిమాలు, రాజకీయాలు వంటి తాత్కాలిక ఆకర్షణలకు గురికాకుండా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అర్బన్ సీఐ యుగంధర్ విద్యార్థులకు సూచించారు. శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల వినియోగ నిరోధక చట్టం, యాంటీ ర్యాగింగ్, బాల్య వివాహాల నివారణ చట్టంపై అవగాహన కల్పించారు. అంతకుమునుపు షీ టీం సభ్యులు కల్పన, శోభ విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాగార్జున రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడ్డవారికి పదవులు ఇవ్వండి

కురబలకోట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడేకి తగిన పదవులను ఇవ్వాలని నియోజకవర్గ పరిశీలకుడు దినేష్‌రెడ్డిని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గ నేతలు శనివారం హార్సిలీహిల్స్‌లో ఆయనతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నో కష్టాలు అనుభవించి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, వారికి ప్రస్తుత పరిస్థితుల్లో గుర్తింపు దక్కడం లేదన్నారు. పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి కమిటీల్లో పదవులను ఇవ్వాలని కోరారు. స్థానిక కమిటీలను వేసే ముందు పాతవారిని పరిగణలోకి తీసుకుని కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై స్పందించిన ఆయన అదిష్టానానికి ఈ సమస్యలను తీసుకుని వెళ్లి కష్టపడిన వారికి న్యాయం చేస్తామన్నారు.